ప్రజాశక్తి
శనివారం 29 ఏప్రిల్ 2023
12 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సమస్యలపై ధ్వజం

- మౌలిక సదుపాయాలు, యుజిడి అంశాలపై ఏకరువు పెట్టిన పార్టీలు
- అగనంపూడి టోల్‌గేట్, క్లాప్ డ్రైవర్ల జీతాలు, జి-20 నాసిరకం పనులపై నిలదీసిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు
- ఏకపక్షంగా అజెండా అంశాల ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు సభ్యులు తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు, యుజిడి సమస్యలపైనా, అభివృద్ధి పనులకు నిధుల లేమిపైనా ధ్వజమెత్తారు. శుక్రవారం గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జివిఎంసి కౌన్సిల్ సమావేశం జరిగింది. 11 గంటలకు ప్రారంభమైన సమావేశం తొలుత అజెండా 32 అంశాలపై కాకుండా సభ్యులంతా ఆది నుంచీ కోరుతున్న 'జీరో అవర్'పైనే సాగింది. సుమారు మధ్యాహ్నం 2.30 గంటల వరకూ ఇది కొనసాగింది. అధికార వైసిపి సభ్యులు సైతం పలు అంశాలను లేవనెత్తడంతో సమావేశం వాడీవేడిగా జరిగింది. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుగుదేశం, వైసిపి,

మిగతా 2లో..

ప్రజా సమస్యలపై నిలదీత

జివిఎంసిలో క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతాలు అమలు చేయాలని నిర్ణయం జరిగినా అమలులో ఎందుకు వైఫల్యం చెందుతున్నారంటూ 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ధ్వజమెత్తారు. 1955 మున్సిపల్ చట్టం ప్రకారం ఏదైనా ఒక నిర్ణయం చేస్తే అది అమలు కాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. కౌన్సిల్‌లో అడిగిన ప్రశ్నలకు సైతం సరైన వివరణను కూడా లిఖిత పూర్వకంగా పాలకవర్గం ఇవ్వడం లేదంటూ

మిగతా 2లో..



నిలదీస్తున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

శ్వేత ఆత్మహత్య కేసులో వీడిన మిస్టరీ

- అత్తింటి వేధింపులే కారణం : కమిషనర్ త్రివిక్రమ వర్మ
- భర్త, అత్తామామలతో పాటు ఆడపడుచు భర్త అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి విశాఖలోని వైఎంసిఎ బీచ్ వద్ద మృతురాలిగా కనిపించిన వివాహిత గురువెల్లి శ్వేత (24) అత్తింటి వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుందని నగర పోలీసు కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను వివరించారు. 2022 ఏప్రిల్‌లో ఆమెకు పెదగంట్యాడకు చెందిన మణికంఠతో వివాహం జరిగిందని, అనంతరం కొంతకాలం ఇరువురూ బాగానే ఉన్నారని తెలిపారు. భర్త మణికంఠకు హైదరాబాదులోని ఐటీ సంస్థలో ఉద్యోగం రావడంతో అక్కడకు వెళ్లిపోయాడని, శ్వేత తమ అత్తమామలైన శాంతరావు, పుష్పవతిలతో పెదగంట్యాడలోనే నివాసం ఉంటోందని తెలిపారు. ఆమెను వారు తరచూ వేధించేవారని, అంతేకాకుండా ఆడపడుచు భర్త యన్ని సత్యనారాయణ ఆమెను లైంగికంగా వేధించేవాడని తెలిపారు. ఈ విషయాన్ని శ్వేత భర్తకు తెలిపినప్పటికీ ఆయన కూడా సత్యనారాయణకు అనుకూలంగా మాట్లాడేవాడిని, ఈ సమస్యలన్నిటినీ భరించలేక ఆమె ఈ నెల

మిగతా 2లో..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి త్రివిక్రమ వర్మ

నేడు మళ్ల, కృష్ణమూర్తి సంతాప సభలు

వార్త 2లో..

3న విశాఖకు సిఎం జగన్

వార్త 2లో..

నిరుపేదలే కిడ్నీ మాఫియా టార్గెట్

- వాంబే కాలనీలో మరో కేసు

ప్రజాశక్తి - మధురవాడ

విశాఖలో కిడ్నీ మాఫియా కలకలం నేపథ్యంలో రోజుకో కొత్త విషయం వెలుగుచూస్తోంది. నిరుపేదలే కిడ్నీ రాకెట్ ముఠా లక్ష్యంగా మారారు. డబ్బు ఆశ చూపించి కిడ్నీలు కాజేయడమే వీరి ప్రధాన వ్యాపారంగా మారింది. ఈ ముఠా విశాఖలోని వాంబే కాలనీని ఎంచుకుంది. ఈ కాలనీకే చెందిన వినయ్ కుమార్ కిడ్నీ అపహరణ కేసు మరవక ముందే అదే ముఠా ఇదే కాలనీకి చెందిన ఒక యువకుడి కిడ్నీని కూడా తీసుకుందనే వార్త స్థానికులను శుక్రవారం కలవరపెట్టింది. శ్రీను అనే యువకునికి ముఠా సభ్యులు డబ్బు ఎరచూపి మూడు నెలల కిందట కిడ్నీ తీసుకున్నట్టు సమాచారం. అతనికి ప్రతిఫలంగా రూ.లక్ష నగదు, ద్విచక్ర వాహనం అందించినట్లు తెలుస్తోంది. అతని విషయంలో కూడా ముఠా సభ్యులు చెప్పిన డబ్బులు ఇవ్వలేదని సమాచారం.

మొదటి పేజీ తరువాయి..

సమస్యలపై ధ్వజం

జనసేన, సిపిఎం, సిపిఐ, బిజెపి సభ్యులు పెద్ద ఎత్తున సభ ముందుంచారు. టిడిపికి చెందిన గుమ్మడి రమణ మాట్లాడుతూ నగరంలో ప్రకాష్ యాడ్స్‌కు టెండర్లు ఇవ్వకుండా ఎలా హోర్డింగులకు అవకాశం ఇస్తున్నారని, రూ.కోట్లు ఇలా కట్టబెట్టడం సరైనదా ? అంటూ ప్రశ్నించారు. కోడి వ్యర్థాల కాంట్రాక్టు విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని గత సమావేశంలోనే చర్చకు పెట్టినా దానిపై ఎలాంటి విచారణ జరగలేదని, వీటిపై ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని శరగడం రాజశేఖర్ డిమాండ్ చేశారు. బిజెపికి చెందిన 33వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత యుజిడి లైన్ల వల్ల తమ వార్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారని, తాగునీరు ఉండడం లేదని, ఈ పనుల్లో నాణ్యత లేదని ఎద్దేవా చేశారు. జి-20 పనుల్లో ఏ కంట్రాక్టర్‌కి ఎంత విలువైన పని ఇచ్చారో ? ఎంత నిధులు ఖర్చుచేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సింహాచలంలో 2 కిలోమీటర్ల రహదారి పూర్తిగా పాడయిపోయిందని గత సమావేశాల నుంచీ చెబుతున్నా పట్టించుకోవడం లేదని టిడిపి కార్పొరేటర్ వరహా లక్ష్మీ నరసింహం ఆవేదన చెందారు. కణితి రోడ్డులో రోడ్డు సౌకర్యం సరిగా లేదని, అంబులెన్సు సౌకర్యం కూడా ప్రజలకు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారని కార్పొరేటర్ ఇమ్రాన్ తెలిపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ సభ్యులు చిన్న చిన్న సమస్యలపైనే ప్రతి కౌన్సిల్‌లోనూ ప్రస్తావిస్తున్నారని, ఇవన్నీ 15 రోజుల్లో పరిష్కారం కావాలని జివిఎంసి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మళ్లీ కౌన్సిల్ నాటికి తాగునీరు, రోడ్లు, లైట్లు వంటి సమస్యల ప్రస్తావన లేకుండా చూడాలని కమిషనర్ సిఎం సాయి వర్మ ఇంజినీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్, డ్రింకింగ్ వాటర్, పారిశుధ్య విభాగ అధికారులకు సూచనలు చేశారు.

కాలుష్యంపై జివిఎంసి దృష్టి సారించాలి : ముత్తంశెట్టి

భీమునిపట్నం ఎంఎల్ఎ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1990వ దశకంలో విశాఖ నగరంలో 30 డిగ్రీలు ఉష్ణోగ్రతలుండేవని, నేడు 40 వరకూ వెళ్లిపోయాయని, కాలుష్య ప్రభావం అధికంగా ఉందని తెలిపారు. సభ్యులంతా మొక్కలు పెంచడంపై దృష్టిసారించాలని సూచించారు. నగరంలో 700 ప్రదేశాలు ఖాళీగా ఉన్నాయని, వీటిల్లో మొక్కలు నాటే ప్రక్రియకు శ్రీకారం చుడితే భావితరాలకు మంచి ఆక్సిజన్ అందించిన వారమవుతామని అన్నారు. ట్రాఫిక్, ఇతర సమస్యల పరిష్కారానికిగానూ కేంద్ర ప్రభుత్వం 12 ఫ్లై ఓవర్లను మంజూరు చేసిందని, త్వరలో వాటి పూర్తికి కృషిచేయాలని అన్నారు. నగరంలో పేదలు నివసించే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి సాయం చేసే కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు.

అంతా ఏకపక్షం.. వాకౌట్ చేసిన సిపిఎం కార్పొరేటర్

ఎంవిపి.కాలనీ : జివిఎంసి పాలకమండలి చివరకు తీవ్ర నిరసనల మధ్యనే ముగిసింది. ప్రధాన అజెండాలోని 32 అంశాలలో 31 అంశాలను ఆమోదించగా 13వ నెంబరు అంశాన్ని వాయిదా వేశారు. టేబుల్ అజెండాలోని 4 అంశాలను ఆమోదించారు. మధ్యాహ్న భోజన విరామణ అనంతరం ప్రారంభమైన ప్రధాన అజెండా ఏ అంశం మీదా కనీసం చర్చ జరగకుండానే ముగిసింది. అంశాలను చర్చించాలని విపక్ష పార్టీలు పట్టుబడినప్పటికీ వైసిపి కార్పొరేటర్లు, మేయర్ ఏకపక్షంగా ముందుకెళ్లారు. అజెండాలో అంశాలను చర్చించాలని పోడియం వద్ద నిరసన తెలిపిన 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మేయర్ ఏకపక్షంగా వైసిపి నాయకులకు వత్తాసు పలకడంతో ఆమె చర్యలను నిరసిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేస్తూ బయటకు వెళ్లిపోయారు. సమావేశం చివరలో జి 20 సమావేశాలకు వెచ్చించిన ఖర్చులపై వివరణ ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు పట్టుపట్టినప్పటికీ మేయర్, కమిషనర్ వారికి సమాధానం చెప్పకుండానే సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయారు. సమావేశం నుంచి వాకౌట్ చేసిన అనంతరం డాక్టర్ బి.గంగారావు మీడియాతో మాట్లాడుతూ ఇది వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని అన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీత

మండిపడ్డారు. జి-20 సమావేశాలకూ, విశాఖ నగర పాలక సంస్థకూ ఎలాంటి సంబంధమూ లేదని, సుమారు రూ.83 కోట్ల వరకూ జివిఎంసి ఖర్చు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. పైగా పనులు నాసిరకంగా జరిగాయన్నారు. పనుల్లో అక్రమాలు కూడా జరిగాయని ఆరోపణలు వస్తున్న క్రమంలో ప్రజలకు జవాబుదారీతనం వహించాల్సిన జివిఎంసి ఎందుకు మిన్నకుంటుందంటూ దుయ్యబట్టారు. అగనంపూడి టోల్‌గేట్‌ను మూసెయ్యాలని జివిఎంసి తీర్మానం చేసినా అమలు కావడం లేదని, దీనివల్ల ప్రజలపై ఎంతో ఆర్థిక భారం పడుతోందని అన్నారు. అనకాపల్లి, ఆనందపురం దగ్గర రెండు టోల్‌గేట్లు జాతీయ రహదారి అథారిటీ వాళ్లు ఓపెన్ చేశారన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా అగనంపూడి వద్ద టోల్‌గేట్ నడపడం దారుణమైన విషయమని విమర్శించారు. సుప్రీంకోర్టులో జివిఎంసి లాయర్లు టోల్‌గేట్ వ్యవహారంలో కుమ్మక్కయి సరిగా వాదించడం లేదంటూ గంగారావు సభకు దృష్టికి తెచ్చారు.

శ్వేత ఆత్మహత్య కేసులో వీడిన మిస్టరీ

25 సాయంత్రం 6:20 గంటలకు భర్తతో గొడవపడి ఫోన్‌ను ఇంటి వద్దనే వదిలేసి బయటకు వెళ్లిపోయిందని చెప్పారు. శ్వేత కనపడకపోవడంతో తెలిసిన ప్రాంతాల్లో వెతికిన అత్తమామలు ఆమె తల్లికి సమాచారం ఇవ్వడంతో రాత్రి 11 గంటల సమయంలో కేసు నమోదైందని తెలిపారు. 26 అర్ధరాత్రి 12:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని యువతి మృతదేహం బీచ్ వద్ద ఉందని అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై శ్వేత మృతదేహంగా గుర్తించారన్నారు. ఈ కేసులో విచారణ అనంతరం భర్త, అత్తమామలు, ఆడపడుచు భర్తలను అరెస్ట్ చేసి, వారిపై వరకట్న వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఇవే కారణాలతో శ్వేత గతంలో కూడా ఒకసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు విచారణలో తేలిందని సిపి తెలిపారు.

కిడ్నీ మాఫియాపై సమగ్ర దర్యాప్తు చేయాలి

దోషులను కఠినంగా శిక్షించాలి

బాధితునికి రూ.50 లక్షలు నష్టపరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో కిడ్నీ మాఫియా చర్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని, తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలను టార్గెట్ చేసుకొని వ్యాపారం సాగిస్తున్న వైనం మరోసారి విశాఖలో వెలుగుచూసిందన్నారు. ఈసారి మధురవాడ వాంబే కాలనీకి చెందిన జి.వినయ్‌కుమార్‌ను కిడ్నీ మాఫియా ఉచ్చులో బిగించిందని తెలిపారు. ఆ వ్యక్తికేకాకుండా ఇంకా అనేకమంది ఈ ముఠా ఉచ్చులో పడ్డారన్న విషయం వెలుగుచూసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు. భవిష్యత్తులో ఇవి పునరావృత్తం కాకుండా కిడ్నీ మాఫియా చర్యలను నివారించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ కోల్పోయి, మోసపోయి తీవ్ర అనారోగ్యం పాలైన జి.వినయ్‌కుమార్ కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ తొలగింపునకు శస్త్ర చికిత్స చేయించిన పెందుర్తిలోని శ్రీ తిరుమల ఆసుపత్రి నిర్వహణకు రిజిస్ట్రేషన్ కూడా లేదని అధికారులు చెబుతున్నారని, ఐదు సంవత్సరాల నుంచి ఆసుపత్రిని నడుపుతుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తోందని జగ్గునాయుడు ప్రశ్నించారు. కిడ్నీ మాఫియాకు అవకాశమిచ్చిన ఆసుపత్రి యాజమాన్యాన్ని శిక్షించాలన్నారు.

విశాఖలో కిడ్నీ మాఫియాను అరికట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్య

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పరిశ్రమలు నాణ్యమైన ఉత్పత్తిని సాధించాలంటే వృత్తి నైపుణ్యత కలిగిన కార్మికుల అవసరం ఎంతైనా ఉంటుందని, అందుకు అనుగుణంగా ఐటిఐ, పాలిటెక్నికల్ కళాశాలల సిలబస్‌లో సమూల మార్పులు తీసుకురానున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డ్స్ - 2023 ప్రదానోత్సవం నగరంలోని నోవాటెల్ హోటల్లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి బుగ్గనతోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఐటిఐలలో అభ్యర్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడం లేదని, వాళ్లు కోర్సు పూర్తి చేసుకుని బయటికి వచ్చిన తర్వాత ఏ పరిశ్రమలోనూ పనిచేయటానికి వారి అర్హత సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఐటిఐలను బలోపేతం చేసి, తద్వారా అభ్యర్థులకు నాణ్యమైన సాంకేతిక శిక్షణ అందించాలని నిర్ణయించిందని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రయోగశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాలలోని పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన అభ్యర్థులను తయారు చేసే విధంగా ఐటిఐ, పాలిటెక్నికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రగతికి ఫ్యాప్సీ ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తే ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. వేర్ హౌసింగ్‌ను ఇండస్ట్రియల్ సెక్టర్లోకి తీసుకువచ్చామని ఆయన తెలియజేశారు. పిసిపిఐఆర్ పరిధిలో 6500 ఎకరాల భూమిని పారిశ్రామిక అవసరాల కోసం సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని సహజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, విశ్రాంత సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్, ఫ్యాప్సీ అధ్యక్షులు కరుణేంద్ర జస్తి, మాజీ అధ్యక్షులు సివి.అచ్యుతరావు, ఉపాధ్యక్షులు కె.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

3న విశాఖకు సిఎం జగన్

ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపనలో పాల్గొనేందుకు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మే 3న విశాఖ రానున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటన వివరాలను ముఖ్యమంత్రి ప్రత్యేక అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం మీడియాకు విడుదల చేశారు. ఈ పర్యటనలో భాగంగా 8:20 గంటలకు సిఎం గన్నవరంలో ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 9:20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9:30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా భోగాపురం మండలంలోని ఎ.రావివలస గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో జిఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు వెళతారు. అనంతరం 10:30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం 1:20 గంటలకు ఎ.రావివలస గ్రామం నుంచి బయలుదేరి 1:40 గంటలకు మధురవాడలోని ఐటి హిల్స్ 4 వద్దకు చేరుకుంటారు. 1:50 గంటలకు అదానీ గ్రూప్ సంస్థకు చెందిన వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధురవాడలోని ఐటి హిల్స్‌లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో పాల్గొని 3:50 గంటలకు విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ తనయుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులను ఆశీర్వదించేందుకు వెళ్తారు. 3.55 గంటలకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం వెళ్తారు.

నేడు మళ్ల, కృష్ణమూర్తి సంతాప సభలు

ప్రజాశక్తి - అనకాపల్లి, ఆరిలోవ : సిపిఎం సీనియర్ నేతలు మళ్ల సత్యనారాయణ, వి.కృష్ణమూర్తిల సంతాప సభలు వారి స్వస్థలాల్లో శనివారం జరుగనున్నాయి. మళ్ల సత్యనారాయణ సంస్మరణ సభ పూడిమడక రోడ్డులోని ఆయన స్వగృహం వద్ద జరుగనుంది. కార్మిక కర్షక యూనియన్ నాయకులు, సిపిఎం, సిపిఐ శ్రేణులు, మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరై విజయవంతం చేయాలని సిపిఎం నేతలు కోరారు. వి.కృష్ణమూర్తి సంస్మరణ సభ శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగనుంది.

ఈ సభకు మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, తదితరులు హాజరుకానున్నారు.

చదువు విషయంలో పిల్లలపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చదువు విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు ఎటువంటి ఒత్తిడీ చేయకూడదని, వారికి ఆసక్తి ఉన్న సబ్జెక్టును చదువుకోవడానికి అవకాశం కల్పించాలని జివిఎంసి అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు హితవుపలికారు. బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో శ్రీ గణేష్ జూనియర్ కాలేజీ (ఎంవిపి కాలనీ)కి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించిన సందర్భంగా శుక్రవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విద్యార్థుల, వారి తల్లిదండ్రుల అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల చదువు పట్ల ఇతరులతో పోల్చవద్దన్నారు. కాలేజీ ఛైర్మన్ లక్ష్మీ గణేష్ మాట్లాడుతూ తాము కాలేజీ ప్రారంభించిన ఏడాదిలోనే రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించడం గర్వంగా ఉందన్నారు. ప్రథమ ఇంటర్ ఎంపిసిలో 470కి షేక్ హైదర్ 465, పాలూరి లలితాశ్రీ ఆదిత్య 463, కోన లక్ష్మీసాయి లహరి 463, టి.శరత్ కుమార్ 462 మార్కులు సాధించారని, మిగిలిన విద్యార్థులు మంచి మార్కులతో హవా చూపించారన్నారు. బైపిసి విభాగంలో 440కి ఎస్.జారోలి 409, వి.దీపికా 404 సాధించారని, ద్వితీయ సంవత్సర విభాగంలో 1000కి బి.నిహారిక ప్రియ 971, సిహెచ్.ప్రణవ్‌కుమార్ 965, జె.తరుణ్ 962 సాధించారని తెలిపారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : 49వ వార్డు బర్మా క్యాంప్ కాలనీ సచివాలయం పరిధిలోని పిఆర్ గార్డెన్స్ ప్రాంతంలో శుక్రవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కెకె రాజు స్థానిక వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకర రావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి ఎం.సునీల్, డైరెక్టర్లు యన్.రవికుమార్, ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, వార్డు నేతలు కమలకుమారి, సరస్వతి, శకుంతల, మెరిసి ఢిల్లీరావు, చంద్రమౌళి, పావని, చైతన్య, శంకర్, ఈశ్వరరావు, మున్నా, హేమ, దేముడు, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కర్రి రామారెడ్డి, కె.చిన్న, సబ్బవరపు శ్రీను పాల్గొన్నారు

అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం, పిట్టలవానిపాలెం, గురజా పాలెం, దొరయ్యపాలెం, పైలవాని పాలెం, నక్కపాలెం, బత్తివానిపాలెం గ్రామాలలో శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార వర్మ, వైసిపి నాయకులు కోన బుజ్జి, నిర్వాసిత నాయకులు రాజాన విజయ్, అడిగర్ల దేవుడు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని కన్నూరు పంచాయతీ మడకపాలెం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, కోన రామారావు, కన్నూరు ఎంపిటిసి గొల్లవిల్లి శ్రీను,



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మడక సూరిబాబు, వెన్నెల సన్యాసిరావు, పైల అప్పల నాయుడు, గంతకోరు రవి, ఎంపిడిఓ హేమసుందరరావు, ఎమ్ఇఒ సునీత, ఎపిఎమ్ కనకమ్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని దిబ్బిడిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పలు వీధుల్లో తిరిగి గ్రామస్తులతో మాట్లాడారు. మెయిన్ రోడ్‌లో టీ కొట్టి వద్ద దోసలు వేస్తున్న అట్ల కర్రను తీసుకొని దోసలు వేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొళ్ళిమళ్ల ఆచ్చంనాయుడు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

43వ వార్డులో ' జగనన్నే మా భవిష్యత్'

సీతమ్మధార : 43వ వార్డు యలమంచిలి వీధిలో స్థానిక కార్పొరేటర్ పెడిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు పాల్గొని ఇంటింటికి వెళ్లి జగనన్న పాలనలో జరుగుతున్న మంచిని వివరించి, ప్రజా అభిప్రాయాన్ని సేకరించారు. ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, బైర వెంకట్, జక్కంపూడి సత్యనారాయణ, తిరుపతి రావు, గంగామహేష్, హరిపట్నాయక్, పారుపల్లి రవి, పద్మాశేఖర్, కె.చిన్నా, బాధ శ్రీను, వల్లి,చంద్రకళ, మండల కన్వీనర్ బులుసు జగదీష్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బిజినెస్ ఎక్స్‌పోకు అనూహ్య స్పందన



ఎక్స్‌పోను సందర్శిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో ఫ్లోరిస్ క్రియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పోకు రెండో రోజైన శుక్రవారం భారీ ఎత్తున ప్రజల సందర్శించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసినఉత్పత్తులను పరిశీలించి, వాటిని కొనుగోలు చేశారు. మరి కొంతమంది వ్యాపార ఒప్పందాలు కూడా చేసుకున్నారు. రెండవరోజున ఎక్స్‌పోకు మంచి స్పందన రావడంతో పరిశ్రమల యజమానులు, నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు.

నిందితులను వదిలి, బాధితుడిని విచారిస్తున్నారు...

పోలీసుల తీరుపై విద్యార్థి, కుటుంబసభ్యుల నిరసన

ప్రజాశక్తి- సీతమ్మధార: తన బట్టలు విప్పి, నగ్నంగా మూడు గంటలపాటు చిత్రహింసలు పెట్టి, అనేక ఇబ్బందులకు గురి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు సైతం నిందారోపితులను కాకుండా తననే విచారిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధిత విద్యార్థి రవికిరణ్ తన కుటుంబ సభ్యులతో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగాడు

ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ తనపై దాడిచేసిన సింగాలమ్మునగానీ, ఆమె కొడుకు సునీల్ , ఇతర నిందితులను పోలీసులు పిలవకుండా పదేపదే తనను విచారిస్తూ మనస్తాపానికి గురిచేస్తున్నారని వాపోయాడు. గురువారం ఫిర్యాదు చేస్తే, ఇప్పటివరకు అవతలి వ్యక్తులను పిలవలేదు, విచారించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను చిత్రహింసలకు గురిచేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని రవికిరణ్ కోరుతున్నారు.దీనిపై నాలుగో పట్టణ సిఐ శ్రీనివాసరావు ప్రశ్నించగా, కేసు నమోదు చేసినట్టు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిత్రహింసలపై తక్షణమే నివేదిక ఇవ్వండి

కాగా, పరీక్ష తప్పిపోయిందని మనస్తాపంతో దు:ఖిస్తూ, పాడుబడిన కారులో కూర్చున్న పాపానికి అతడిపై దొంగగా నిందమోపి, చిత్రహింసలకు గురిచేసిన అభియోగాలపై సమగ్ర నివేదికను కోరుతున్నట్టుఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం తెలిపారు. విద్యార్థి రవికిరణ్ బట్టలూడదీసి, నగ్నంగా కొట్టడంపై వివరణ కోరారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు కమిషన్ సిఫార్సు చేయనుందని వెల్లడించారు.

పారిశ్రామిక ప్రాంత సమస్యలపై ప్రస్తావన

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలపై శుక్రవారం జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో 40 వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు లేవనెత్తారు. హెచ్‌పిసిఎల్ విస్తరణలో భాగంగా సింధియా నుండి ఐఒసి కంపెనీ వరకు ఉన్న డివైడర్‌ను తొలగించి ఐదేళ్లవుతున్నా నేటికీ పునర్నిర్మించలేదని విన్నవించారు. షిపియార్డ్ కాలనీ, ఇఎస్ఐ హాస్పిటల్, వెటర్నరీ హాస్పిటల్, ఎకెసి కాలనీ, ఎంఇఎస్, నౌసేనాబాగ్, పోలీస్‌స్టేషన్, మరికొన్ని ప్రాంతాల పరిధిలోని ఈ ప్రధానమార్గంలో డివైడర్ లేకపోవడం వల్ల ఎక్కడికక్కడే వాహనదారులు యూటర్న్ తిరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వార్డు పరిధిలో చాలినంతమంది పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఉందన్నారు. దీనిపై సమావేశంలో ప్రస్తావించడంతో పాటు, పరిష్కరించాలని కోరుతూ కమిషనర్, మేయర్లకు వినతిపత్రం అందించారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డులోని

వార్డు సమస్యల పరిష్కారానికి వినతి

ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మకు వార్డు కార్పొరేటర్ బొడ్డ నరసింహపాత్రుడు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.వార్డులోని వాంబే కాలనీ ఏర్పాటు సమయంలో నిర్మించిన డ్రెనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. ఇదే కాలువల్లో పందుల స్వైరవిహారం వల్ల ప్రజలు అపరిశుభ్రతతో నానా అవస్థలు, రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డ్రెనేజీ వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించాలని కోరారు. వార్డుపరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండాచర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భానోజీతోటలో శిథిలావస్థకు చేరుకున్న సామాజిక భవనాన్ని తొలగించి అదే స్థలంలో కొత్త భవనం నిర్మించాలని, పాఠశాల,అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు వీలుగా నిర్మాణం చేపట్టాలని కోరారు.వార్డులోని ఆయా కాలనీల ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, తాను త్వరలో వార్డు పర్యటనకు వస్తానని, అపుడు అన్నీ పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారని నరసింహపాత్రుడు తెలిపారు.

30న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 30న మధురవాడ మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యల్. శివ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్ సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే, తమ అర్హత ధ్రువపత్రాలతో పరీక్ష కేంద్రానికి వచ్చి సంబంధిత అధికారులను సంప్రదించి పరీక్ష రాయవచ్చునని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

నిర్లక్ష్యం వల్లే నీటి సమస్య

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రింగి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ ఒకటో వార్డు సభ్యులు మహంతి అప్పలనాయుడు కోరారు. .గ్రామానికి చుట్టు ప్రక్కల భూగర్భజలాలు అడుగంటి పోవడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. గ్రామానికి అనుకుని లైఫ్‌లైన్ ఫుడ్ కంపెనీ ఉండడంతో, ఆ కంపెనీలో భారీస్థాయిలో బోర్లు తవ్వకాల వల్ల భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని, వేసవి వచ్చేసరికి గ్రామంలోని బోర్లు మొరాయిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కంపెనీకి సంబంధించి మరో బోరు తవ్వుతుండగా అడ్డుకున్నామని, కంపెనీ బోర్లు తవ్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి - సీతమ్మధార : 23వ వార్డులో అనధికారికంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారంతొలగించారు ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఏసిపి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మూడో జోన్ పరిధిలో అనధికారికంగా నిర్మిస్తున్న మూడో అంతస్తు శ్లాబ్‌కు రంధ్రం పెట్టామన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ చైన్‌మ్యాన్, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : ఐదోవార్డు కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు తాగునీటి కుళాయి కనెక్షన్ నిమిత్తం ఇంటి పన్నులు వెయ్యాలని వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు. శుక్రవారం జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో వార్డు సమస్యలపై తన గళం వినిపించి, కార్పొరేటర్ మొల్లి హేమలత, తర్వాత మేయర్, కమిషనర్లకు వినతిపత్రం అందించారు. కొండవాలు ప్రాంతాలైన అయ్యప్పనగర్, శారదనగర్, సాయిరాంకాలనీ, డ్రైవర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్‌లలో తాగునీటి పైప్ లైన్లు రూ.కోటి వ్యయంతో వేయించినా, ఆయా ప్రాంతాలకు ఇంటిపన్నులు లేకపోవడం వల్ల కుళాయిలు ఇవ్వడం లేదన్నారు. డంపింగ్‌యార్డ్ పొగకాలుష్యంతో జెఎన్ఎన్‌యుఆర్ఎం, వైఎస్ఆర్ కాలనీ, సాయిరాం కాలనీ, స్వతంత్రనగర్, ఎన్టీఆర్ హుదూద్ కాలనీలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాజీవ్ గృహకల్ప, వైఎస్ఆర్ కాలనీ, జెఎన్ఎన్ఆర్ఎం కాలనీలో యుజిడిల సమస్య పరిష్కారానికి, శ్మశానవాటికల ఆధునీకరణకు, వార్డ్‌లో మౌలిక సదుపాయాలు కల్పనకు సహకరించాలని కోరారు

బిసిల నిజమైన నేస్తం కాంగ్రెస్

ప్రజాశక్తి- మాధవధార : బిసిలకు నిజమైన, నిష్కల్మషమైన నేస్తం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఎపి కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు అన్నారు.బిసిలపై టిడిపి, వైసిపి కపట ప్రేమ కనబరుస్తున్నాయని ఆరోపించారు. బిసిలకు విద్య, ఉద్యోగాల్లో 25శాతం రిజర్వేషన్లను 1975లోనే కాంగ్రెస్ పార్టీ కల్పించిందన్నారు. బిసిలకు రిజర్వేషన్ల పెంపునకు మురళీధరరావు కమిషన్‌ను 1981లో అప్పటి ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ నియమించారన్నారు. తర్వాత బిసిల రిజర్వేషన్లపై బూటకపు హామీనిచ్చి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు.1993లో స్థానికసంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్ కల్పించిందికూడా కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సచివాలయంలో బిసిల విభాగం ప్రారంభం, బిసి హాస్టల్స్, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, బిసి స్టడీ సెంటర్లు, స్కాలర్‌షిప్‌లు, బిసి కమిషన్లు, బిపిఎల్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా అన్నీ కాంగ్రెస్ పాలనలోనే కల్పించామన్నారు. టిడిపి, వైసిపిలకు బిసిలపై ఉన్నది కపట ప్రేమ మాత్రమేనని స్పష్టం చేశారు.

ఒపిఎస్ పునరుద్ధరించాలి

రక్షణరంగ ఉద్యోగుల నిరసన



ఎన్ఎడి గేటు వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న రక్షణరంగ ఉద్యోగులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : నూతన పింఛను విధానాన్ని రద్దు చేసి పాతపింఛను విధానాన్ని ను పునరుద్ధరించాలని ఎన్ఎడి సిఎ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్ఎడి ప్రధానగేటు దగ్గర ప్రభుత్వ కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ఎన్ఎడి ఉద్యోగులు నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తేవడం ద్వారా కార్మిక హక్కులు, అధికారాలను హరించి, యాజమాన్యాలకు కట్టుబానిసలను చేసే చర్యలు చేపట్టిందని ఆరోపించారు. ఆసుపత్రులు, శిక్షణ కేంద్రాలు ఇలా అనేక చోట్ల పనిచేసే ఉద్యోగులకు యూనియన్లను పెట్టుకునే అధికారం లేకుండా చేసిందని దుయ్యబట్టారు. జెసిఎం సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, సమస్యలు పరిష్కారానికి నాన్చివేత ధోరణి అవలంబిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్టే చర్యలకు పూనుకుంటోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు విసిగిపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పటికే మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ సురేష్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపిని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నేత విజయ

ప్రజాశక్తి -కంచరపాలెం : మహిళా రెజ్లింగ్ క్రీడాకారులను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్‌సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డివైఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కంచరపాలెం బిఎన్ఆర్ భవనంలో నిర్వహించిన సభలో డివైఎఫ్ఐ జిల్లా యువత కన్వీనర్ పి.విజయ మాట్లాడుతూ రెజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగుతున్న బిజెపి ఎంపీ బ్రిజు భూషణ్‌సింగ్ అదే విభాగానికి చెందిన మహిళా క్రీడాకారులను వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. తమకు న్యాయం చేయాలని బాధిత రెజ్లర్లు నాలుగు రోజులుగా ధర్నా చేస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడం విచాకరమన్నారు. తమపార్టీకి చెందిన ఎంపీ కావడం వల్లే ఇటువంటి నీచపుచర్యలకు పాల్పడినా బ్రిజు భూషణ్‌సింగ్‌పై ప్రధానిమోడీ, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలకు ఆదేశించడం లేదన్నారు. ద్వంద్వవైఖరి అవలంభిస్తోన్న మోడీ సర్కారు ఇప్పటికైనా కళ్లు తెరిచి, బాధ్యుడైన ఎంపిపై చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని కోరారు.క్రీడాకారులకు మద్దతుగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ప్రభాకర్, రాజశేఖర్, శరత్ పాల్గొన్నారు.

జెఎసి సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పద్మనాభం : ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి రాష్ట్ర కమిటీ పిలువు మేరకు ఈ నెల 30న నిర్వహిస్తున్న సమావేశాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు గోపి, రవి శుక్రవారం ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పరిస్థితుల్లో ఏంచేయాలనే దానిపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులంతా హాజరు కావాలని కోరారు.

దశమకొండ నిర్మాణంలో సుబ్బారావు కీలకపాత్ర

సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

ప్రజాశక్తి -గాజువాక.: దశమకొండ నిర్మాణంలో సిపిఎం నేత సుబ్బారావు పాత్ర చాలా కీలకమైనదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అన్నారు. శుక్రవారం దశమకొండలో సుబ్బారావు సంతాప సభ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ, దశమకొండ ఏరియాలో పేదలకు స్థలాలు ఇప్పించడంలోనూ, ఇళ్లనిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పనలో సుబ్బారావు ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా దశమకొండ కాలనీ నిర్మాణం జరిగిందన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు ఎర్రజెండా నీడన ఉద్యమించిన వ్యక్తి సుబ్బారావు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి జగ్గు నాయుడు, ఏరియా సిపిఎం నేతలు పల్లెల నర్సింగరావు, లోకేష్ పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న జగ్గు నాయుడు.

విలువలతో కూడిన విద్య అవసరం



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించాలని సింహపురి యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్ సుదర్శనరావు అన్నారు. శుక్రవారం గాజువాక శ్రీనగర్‌లోని ఆపిల్ ఐ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. 5, 6, 7 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతిగా జోసెఫ్, ఆసీస్ రెడ్లకు రూ.పదివేల నగదును, ద్వితీయ బహుమతిగా ఎన్ఎస్‌టిఎల్ స్కూల్ విద్యార్థులు సాయికృష్ణ, స్నితిక్‌లకు రూ.ఏడు వేలు, తృతీయ బహుమతిగా డి పాల్ స్కూల్ విద్యార్థులున సాత్విక్ వర్మ, అరుణ కుంతియాకు రూ.ఐదు వేలు అందించారు. 8, 9, 10 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి ఆపిల్ హైస్కూల్‌కు, ద్వితీయ బహుమతి ఎన్ఎస్‌టిఎల్ పాఠశాలకు వచ్చింది.

ఈ సందర్భంగా సుదర్శనరావు మాట్లాడుతూ విద్యార్థులకు విశ్లేషణాత్మక జ్ఞానాన్ని నేర్పించాలని కోరారు. విద్య అనేది మానవాభివృద్ధికి, సమాజహితంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బలరామకృష్ణ, డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మూడోవార్డు పరిధిలోని జివిఎంసి యుపి పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం హిందీ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన వీటిని విద్యార్థులకు అందజేశారు కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు, వైసిపి నాయకులు పొట్నూరు చంద్ర శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ జయసుధ, ఉపాధ్యాయులు జె రమాదేవి, శ్రీ గౌరి, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు



హిందీ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

వేసవిలో కళ్లను నిర్లక్ష్యం చేయొద్దు!

ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యనిపుణులు డాక్టర్ హిమబిందు అల్లూరి





డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవి కాలంలో చాలామంది శరీర సౌందర్యానికి, డీహైడ్రేషన్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారే తప్ప, కళ్లకు, కంటి ఆరోగ్యానికి అంతగా ప్రాధ్యాన్యత నివ్వరు. ఈ పరిస్థితుల్లో కళ్లకు పలు సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యం వేసవిలో కంటి ఆరోగ్యాన్ని, నేత్రాల సంరక్షణకు ఎల్‌వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞానసంస్థ, కంటి వైద్యనిపుణులు డాక్టర్ హిమబిందు అల్లూరి కొన్ని సూచనలు చేశారు. వేసవి కాలంలో కళ్ళకు, దృష్టికి శాశ్వత హాని రాకుండా నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

వేసవిలో తీవ్రమైన వేడి, గాలిలో అధిక కాలుష్యం కారణంగా కళ్లకు ఇన్‌ఫెక్షన్లు, ఎరుపుదనం, దురద వంటి కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వేడి, పొడి వాతావరణం కారణంగా కంటిపై కన్నీటి పొర వేగంగా ఆవిరైపోతుందన్నారు. దీంతో కళ్లల్లో మంట, చికాకు కలిగిస్తాయి. పొడి కళ్లు ఉన్న రోగుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వేసవిలో కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఎండలో బయటకు వెళ్లే సమయంలో సూర్యరశ్మిని నేరుగా కళ్లపై పడకుండా, సూర్యుడిని నేరుగా చూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతినీలలోహిత కిరణాలకు అడ్డుపడేలా కళ్లకు చలువ కళ్ళద్దాలను ఉపయోగించడం, టోపీ లేదా గొడుగు ఉపయోగించడం మంచిదన్నారు. వీటితో పాటు వ్యక్తిగత పారిశుధ్యాన్ని పాటించడం, శుభ్రమైన నీటితో తరచూ కళ్లను శుభ్రపరచుకోవాలని సూచించారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, దుమ్ము వ్యాప్తిచెందే పరిసరాలకు వెళ్ళడం మానుకోవాలన్నారు. ఈతకు వెళ్ళే సమయంలో సురక్షితంగా ఉండే కళ్ళద్దాలను ధరించడం మంచిదన్నారు.తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేసవిలో కంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవచ్చని డాక్టర్ హిమబిందు సూచించారు.

లేఅవుట్ అనుమతులు రద్దు చేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార : రామానాయుడు స్టూడియోలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తాడేపల్లి ప్యాలెస్ వాటాల పుణ్యమేనని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. శుక్రవారం పౌరగ్రంథాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, వాటాలు, కమీషన్ల కోసం ప్రభుత్వ పెద్దలు పరిశ్రమలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. రామానాయుడు స్టూడియోలో లేఅవుట్ ఏర్పాటు చట్టాల ఉల్లంఘన కిందకే వస్తుందని, వెంటనే అనుమతులు రద్దు చేసి, మిగులు భూమి 34.44 ఎకరాలను వేరే స్టుడియోకు కేటాయించాలని కోరారు. లేఅవుట్‌కు అక్రమ అనుమతులు ఇచ్చిన జివిఎంసి పూర్వ కమిషనర్ రాజాబాబుపై చర్యలు తీసకోవాలని డిమాండ్ చేశారు. రుషికొండ, దసపల్లా, ఎన్‌సిసి కొండలు వైసిపి హయాంలో పూర్తిగా ధ్వంసం, పరాధీనమయ్యాయని ఆరోపించారు.

క్షతగాత్రునికి పరామర్శ



క్షతగాత్రుని పరామర్శి స్తున్న టిడిపి నేత సురేష్, తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, రాజ వీధికి చెందిన ఎం జనార్ధనరావును స్థానిక టిడిపి నాయకులు శుక్రవారం బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి కారణాలపై అడిగి తెలుసుకున్నారు టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్, పార్టీ నాయకులు బడిగింటి మహేష్, గణేష్ రెడ్డి, జోగ సన్యాసి రావు, గిడుతూరి శ్రీనివాసరావు తది తరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా టిడిపి నేత సురేష్ మాట్లాడుతూ, చిట్టి వలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రోజుల తరబడి మురుగు నీటి నిల్వ వల్ల, అక్కడ రోడ్డుకు ఎడమ వైపుగా వెళ్లాల్సిన బైకిస్టులు గత్యంతరం లేని పరిస్థితుల్లో రాంగ్‌రూట్‌లో కుడివైపు మార్గంలో ప్రయాణించడం వల్ల తరచూ ఈ తరహా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి



సమావేశంలో మాట్లాడుతున్న రఘురామరాజు

ప్రజాశక్తి -ములగాడ: తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ శతజయంతిని నిర్వహించారు. ఆర్‌కెపురం పెట్రోల్ బంక్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిఎన్‌టియుసి పార్లమెంటరీనియోజకవర్గ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 200మందికి అల్పాహారాన్ని అందించారు. పార్టీ పిలుపుమేరకు ప్రతినెలా 8,18,,28 తేదీల్లో మల్కాపురంలో ఎన్‌టిఆర్ శతజయంతిని నిర్వహిస్తూ, అన్న ఎన్‌టిఆర్‌ను స్మరించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సిహెచ్ కన్నారావు, మాడిసి రమణమూర్తి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొర్రాయి.నాగార్జునరావు, కె..ఆది, చింతలపూడి సత్తిబాబు, జయశంకర్, నూనెల శ్రీనివాసరావు ఆర్మీ భీమ, కోన శేఖర్ , హిందుస్థాన్ షిప్‌యార్డ్ లేబర్ కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజాన్ ప్రసాద్, క్లబ్ రమణ, నేవల్ డాక్ యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతపోక్కల కృష్ణ, ఎకెసి సురేష్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పోత్తిబత్తుల నర్సింగ్, ఉరుకూటి హరి, విశాఖ జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తారక్, కోశాధికారి చెల్లుబోయిన శ్రీను పాల్గొన్నారు

ఉష్ణతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి..


తగరపువలసలో నిర్మానుష్యంగా రోడ్లు

◆ ఎండల దెబ్బకు అల్లాడిపోతున్న జనం

◆ కర్ఫ్యూను తలపించేలా నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి -తగరపువలస : గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మండుటెండలకు తోడు వేసవి వడ గాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

ఈ స్థాయిలో ఎండలను ఎన్నడూ చూడలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. గాలిలో తేమ శాతం కూడా పెరుగుతున్నందున తట్టుకోలేనంతగా వేడి అలముకుంటోంది. గత రెండ్రోజులుగా ఎండలు మరింత తీవ్రమయ్యాయి. సాయం సంధ్యవేళ దాటి చీకటి పడినా వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో నిత్యం జన సమ్మర్ధంగా ఉండే తగరపువలస కూడలిలోనూ శుక్ర వారం ఉదయం 11.30గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ప్రధాన రోడ్లు కర్ఫ్యూను తలపించాయి. ఎండ వేడిమి నుండి ఉపశమనానికి టోపీలు పెట్టుకుని, గొడుగులు వేసుకొని బయటకు వస్తున్నారు. బైక్‌లు, ఇతరత్రా వాహనాల్లో ప్రయాణించే వారు సైతం తగు జాగ్రత్తలు తీసుకుంటేగానీ కాలు బయట పెట్టని పరిస్థితి ఉంది. అయినప్పటికీ ఎండలు ప్రజలు అల్లాడిస్తూనే ఉన్నాయి. ఇళ్లల్లోని గోడలు, వస్తువులతోపాటు నీడలో ఉన్నప్పటికీ శరీరంపై ఉన్న, ఇంకా ఇంట్లో ఉన్న దుస్తులు, బట్టలుసైతం వేడెక్కిపోతున్నాయి. వేసవి ఉంచి ఉపశమనానికి పండ్లరసాలు, తాటాకు ముంజెలు, మజ్జిగ, చన్నీరు వంటికి తీసుకుంటున్నప్పటికీ వెనువెంటనే గొంతుతడారిపోయే పరిస్థితి ఉంది. మండుటెండల దెబ్బకు చిన్నపిల్లలు, వృద్ధులతోపాటు రోగులు ఊపిరిసలపని స్థితిలో ఉక్కిరిబిక్కిరై పోతున్నారు.ఏప్రిల్ నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే, ముున్ముందు మండుటెండలు అగ్నికార్తెల రోజులనాటికి పరిస్థితి ఇంకెంత ఇబ్బందికరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తప్పని సరి



ఎండా కాలంలో ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలిన ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు సాధ్యమైనంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. మిగిలిన వారు సైతం అత్యవసరమనుకుంటే ఉదయం 9గంటల లోపు, సాయంత్రం ఐదు గంటల తర్వాత బయటకు వెళ్లడం మంచిది. గొంతెండి వడదెబ్బకు గురికాకుండా ఎప్పటికప్పుడు మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరిబోండాలు, వంటివి తీసుకోవడం మంచిది. పకోడి, సమోసా, వేపుళ్లు వంటి వాటికి దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆకుకూరలు తినాలి, ఎండల తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, కళ్లద్దాల రక్షణ అవసరం.

డాక్టర్ కె.రామారావు, తగరపువలస

అక్రమాల ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి- సీతమ్మధార: 26వ వార్డు శ్యామలంబ దేవస్థానంలో అక్రమాలు జరుగుతున్నట్లు స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదు మేరకు దేవాదాయశాఖ ఎసి, కనకమహాలక్ష్మి దేవస్థానంఇఒ శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం దేవస్థానం ఆవరణలో విచారణ చేపట్టారు, ఫిర్యాదుదారులు, స్థానికులతోపాటు కమిటీ సభ్యులను విచారించి వివరాలు సేకరించారు.

ఈ సందర్భంగా ఎసి శిరీష మాట్లాడుతూ, దేవస్థానానికి శిలా సన్యాసిరావు, జక్కంపూడి రమాదేవి, దేవేందర్, జగన్, మురళిలతో కూడిన ఐదు సభ్యుల నిర్వహణ కమిటీ వేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఆవరణలో చుట్టూ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హుండీ ఆదాయాన్ని కమిటీ సభ్యులు సమక్షంలో లెక్కించాలని సూచించారు అనంతరం హుండీకి సీల్ వేశారు సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, పోతూ సత్యనారాయణ, ముక్కా కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.


విచారిస్తున్న దేవాదాయశాఖ ఎసి శిరీష

గెడ్డ నీరే గతి..!



▸▸ కనీసం బోరు బావి కూడా లేని చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలు

▸▸ అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం

▸▸ రహదారి లేక తీవ్ర ఇబ్బందులు.. నేటికీ డోలి మోతలే శరణ్యం

ప్రజాశక్తి -సీలేరు : రహదారులు, మంచినీటి సౌకర్యాలు కల్పించడానికి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్ని కబుర్లు చెప్పినా, ఆ సౌకర్యాలేవీ తమ దరికి చేరడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గుక్కెడు నీటి కోసం గిరిజనులు ఆపసోపాలో పడుతున్నారు. రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వారికి డోలిమోతలే శరణ్యమవుతున్నాయి. ఇటువంటి పరిస్థితి ఎక్కడో కాదు.., సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోనే ఉంది.

జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోని చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలు చింతపల్లి క్యాంపు గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయినా ఈ రెండు గ్రామాలకు నేటికీ తాగునీటి వనరుల్లేవు. కనీసం బోరుబావి కూడా లేదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ రెండు గ్రామాల ప్రజలు సీలేరు నది పరివాహక ప్రాంతంలో పిల్ల కాలువలు ద్వారా వచ్చిన నీటినే తాగుతున్నారు. తమ గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గెడ్డల్లో పెద్ద పెద్ద గుంతల ఏర్పాటు చేసుకొని అందులో నీటిని సేకరించి ఆ నీటినే తాగడానికి, వాడుకోవడానికి వినియోగిస్తున్నారు.

వేసవి కాలంలో మండుటెండలో సైతం రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అదే వర్షా కాలంలో అయితే గెడ్డల్లోని నీరు బురదమయం కాగా, ఆ నీటినే తాగాల్సి వస్తోంది. ఈ కలుషిత నీరు తాగడం వల్ల గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. తాగడానికి అత్యవసరమైన మంచినీటటి సౌకర్యం లేకుంటే తాము ఎలా బతికేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విన్నవించినా ఫలితం శూన్యం

తమ గ్రామాలకు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఈ రెండు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తమకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆరోపిం చారు. ఇప్పటికైనా జిల్లా, ఐటిడిఎ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామాలకు మినీ వాటర్ ట్యాంక్ గాని, బోరుబావులు గాని ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు లేక డోలిమోతలు

సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రుపల్లి, లైకెన్‌పూర్ గ్రామాలకు మట్టి రోడ్డు కూడా లేదు. ఈ గ్రామాల నుంచి చింతపల్లి క్యాంపు గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల మేరకు ఎటువంటి రహదారి లేకపోవడంతో కాలిబాటలో నడుచుకుంటూ నిత్యావసర సరుకులు తెచ్చుకుంటున్నారు. అనారోగ్యం సమయాల్లో డోలి కట్టి రోగులను అడవి మధ్యలో నుండి మోసుకుంటూ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామసభల ద్వారా అధికారులకు విన్నవించి, సమస్యలను లిఖితపూర్వకంగా అందజేసిన ఇప్పటి వరకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టలేదని వాపోయారు. ఇప్పటికైనా తమ గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.


గెడ్డలోని కలుషిత నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

ఎన్ఎస్‌టిఎల్‌లో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి- కరాస: వచ్చేనెల 11న, జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ప్రీమియర్ నావెల్ రీసెర్చ్ లేబరేటరీ, నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించనున్నట్లు ఎన్ఎన్‌టిఎల్ అధికారులు తెలిపారు..దీనిలో భాగంగా మే 9, 10 తేదీలలో ఎన్ఎస్‌టిఎల్ ఉత్పత్తుల ప్రదర్శన, ఎన్ఎస్‌టిఎల్ మల్టీ మీడియా ప్రజెంటేషన్, గ్రేటెడ్ అప్రోచ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సస్టనేబుల్ ఫ్యూచర్ అనే అంశంపై నమూనాల తయారీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ థీమ్‌పై విద్యార్థులు తయారుచేసిన సజనాత్మక నమూనాలను సంబంధిత కళాశాల లేదా పాఠశాల ప్రిన్సిపల్ ద్వారా ఎన్ఎస్‌టిఎల్‌కు మే మూడో తేదీలోగా పంపించాలని సూచించారు. ఎంపికైన నమూనాలను ఎన్ఎస్‌టిఎల్ ఉత్పత్తుల ప్రదర్శనలో ప్రదర్శించడంతోపాటు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలు కోసం వివరాలకు శాస్త్రవేత్తలు కిషోర్ కిషోర్ చంద్ సెల్‌నెంబర్ 9490232433కు సంప్రదించాలని సూచించారు.

'మెంటారింగ్'పై గీతం అధ్యాపకులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థికి కోర్సు పూర్తి చేసి వెళ్ళేంత వరకు చదువులో వెనకబడకుండా పర్యవేక్షణ, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు ఇలా ప్రతిఅంశంలోనూ మార్గదర్శకుడిగా వెన్నటే ఉండేందుకు 'మెంటారింగ్' విధానం అమలు చేయనున్నట్లు గీతం కెరీర్ కౌన్సిలింగ్, మెంటారింగ్ విభాగం డైరక్టర్ ఉమాదేవి తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించి గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధ్యాపకులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులలో ప్రతి 20 మందికి ఒక అధ్యాపకుడు మెంటార్‌గా వ్యవహరిస్తారనానరు. ఈ మేరకు 200 మంది అధ్యాపకులకు మెంటారింగ్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. గీతం నుంచి ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపిక అవుతున్నారని, అలాగే విదేశీ విద్య వైపు కొందరు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.. విద్యార్థులు గేట్ వంటి పరీక్షలతో పాటు సివిల్స్ తదితర పోటీ పరీక్షల పట్ల ఆసక్తి కనబరిస్తే వారికి తగిన శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో టాలెంట్ మెట్రిక్స్ (ముంబై) శిక్షకురాలు వినోరా లోబో, యోగితా మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో మెంటార్ బాధ్యత కీలకంగా మారిందన్నారు. విద్యాలయాలలో మెంటార్‌లుగా వ్యవహరించే అద్యాపకులు విద్యార్థులకు సరైన మార్గదర్శకం వహిస్తే పరోక్షంగా సమాజానికి మేలు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకుంటే మెంటార్‌లుగా వ్యవహరించే అద్యాపకులకు ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో గీతం ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- పెందుర్తి :కిడ్నీ రాకెట్‌పై సమగ్ర విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కన్వీనర్ వై రాంబాబు ఒక ప్రకటనలో కోరారు.పెందుర్తి తిరుమల హాస్పిటల్‌లో జరిగిన సంఘటనపై కలెక్టర్‌తో విచారణ జరిపి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పెందుర్తి స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేసినా, అక్కడి సీఐ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శనివారం 29
ఏప్రిల్ 2023

ఆదర్శవాది..కృష్ణమూర్తి

ప్రజాశక్తి - ఆరిలోవ

ఇటీవల మృతిచెందిన సిపిఎం సీనియర్ నాయకులు వి.కృష్ణమూర్తి. ఆదర్శమూర్తి. జీవితాంతం పేదల పక్షాన పోరాటం చేశారు. కాలనీల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన ఈ నెల 19న బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందడం పలువురిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడున్నారు. కృష్ణమూర్తి 1984లో ఆరిలోవ కాలనీ ఏర్పడిన దగ్గర నుంచి ఆ కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, సిఐటియు రాష్ట్ర ప్రధాక కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మలు జిల్లా నాయకులుగా ఉన్నప్పుడే ఆయన సిపిఎం సాధారణ సభ్యత్వాన్ని పొంది ప్రజా సేవకు అంకితమై పూర్తి కాలం పనిచేయడానకి సిద్ధపడ్డారు. పేదరికం పోవాలని, అందరికీ సమాన హక్కులు కల్పించబడాలని, దేశంలో కార్మికరాజ్యం రావాలని కోరుకునేవారు. తన కుటుంబాన్ని కూడా సమాజం కోసం పనిచేయాలని ప్రోత్సహించిన గుణవంతుడు. అందులో భాగంగానే భార్య అన్నపూర్ణ ఆరిలోవ మహిళా సంఘం నాయకురాలుగా బాధ్యతలు తీసుకొని పనిచేశారు. కుమార్తె శార్వాని ఎస్ఎఫ్ఐలోనూ, కుమారుడు మోహన్ డివైఎఫ్ఐలోనూ పనిచేసేందుకు కృష్ణమూర్తి నిరంతరం ప్రోత్సహించారు. ప్రస్తుతం తన కుమార్తె, కోడలు ఆశాలుగా పనిచేస్తూ సిఐటియు యూనియన్‌లో పిహెచ్‌సిలలో ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. కృష్ణమూర్తి పిల్లలిద్దరికీ కుల, మతాలకతీతంగా వివాహాలు జరిపించి ఆదర్శంగా నిలిచారు. ఆయన ఆరిలోవ ప్రాంతంలోనే కాకుండా జిల్లాలో అనేక సమస్యలపై పోరాటాలు చేశారు. విద్యుత్ ఉద్యమం, పేదలకు ఇళ్ల స్థలాలు, విమ్స్ హాస్పిటల్ నిర్మాణం వంటి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. నలభై సంవత్సరాలుగా ఆయన సాధారణ జీవితాన్ని గడుపుతూ ప్రజలకు అనేక సేవలందించారు. ఇరవై సంవత్సరాలుగా పార్టీ జిల్లా అకౌంట్స్ నిర్వహణ చూస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులతోనూ, ప్రజా ప్రతినిధులతోనూ చాకచక్యంగా, నమ్రతతో మెలిగేవారు. ఆయన మృతి కుటుంబానికి, పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ఆయన మృతికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

కడవరకూ పేదల పక్షాన పోరాటం
కేసులు, అరెస్టులకు వెరవనితత్వం



అంకితభావంతో పనిచేసిన కామ్రేడ్

కృష్ణమూర్తి గొప్ప అంకితభావం కలిగిన కామ్రేడ్. అసంఘటిత రంగ కార్మికునిగా జీవితం ప్రారంభించారు. సిఐటియు ద్వారా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఆయన మొదటి నుంచీ ఎర్రజెండాను నమ్ముకుని కడవరకూ నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారు. ఆరిలోవ ప్రాంతంలో నివాస కాలనీలు ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. సుందరయ్య, లీలా సుందరయ్య, భగత్‌సింగ్ కాలనీ సహా పలు కాలనీలకు కమ్యూనిస్టు పార్టీ నేతల పేర్లు పెట్టడం, ప్రజలను భాగస్వాములను చేయడంలో కీలకపాత్ర పోషించారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. ఏదైనా ఒక అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా చెప్పేవారు. నివాస ప్రాంతాలకు, నగర కమిటీకి వారధిగా ఉండే మనిషి. అనేక పోలీసు కేసులు, నిర్బంధాలను ఎదుర్కొన్నారు. భూ పోరాటంలో కీలకంగా వ్యవహరించారు. నాతోపాటు 14 రోజులు కేంద్ర కారాగారంలో ఉన్నారు. బిఎన్ఆర్ నగర్ పోరాటంలోనూ కీలకపాత్ర పోషించారు. అన్ని సందర్భాల్లోనూ పార్టీ పట్ల విధేయతతో, వినమ్రతతో ఉండేవారు. కుటుంబాన్ని పార్టీ కార్యక్రమాలవైపు ప్రోత్సహించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ఏ సందర్భంలోనూ ఉన్నదానిలో సర్దుకుపోయే మనస్తత్వం ఉన్న వ్యక్తి. పార్టీ ఇచ్చిన అన్ని బాధ్యతలనూ నిర్వర్తించారు. సుదీర్ఘకాలం పాటు ఏరియా పనిలో, పార్టీ, జిల్లా ఆఫీసుల్లో అకౌంట్ నిర్వహణలో చాలా క్రమశిక్షణతో వ్యవహరించారు. సెంటర్ శాఖ కార్యదర్శిగానూ పనిచేశారు. జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ఏర్పాటులోనూ భాగస్వాములయ్యారు. నేత్ర, దేహదానాలను ప్రోత్సహించారు. మహోన్నత ఆశయంతో బతికారు. ఆయన సేవలు మరువలేనివి. ఆశయ సాధనకు కృషిచేద్దాం.

- కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

నిబద్ధత గల కామ్రేడ్ కృష్ణమూర్తి

మనిషి అకాల మరణానికి వయస్సు, పేద, గొప్ప తారతమ్యం లేదని కరోనా మహమ్మారి నిరూపించింది. అనారోగ్యం తీవ్రమై ఆసుపత్రి కాకపోయినా మృత్యువు కబళిస్తుందని కృష్ణమూర్తి మరణ విషాదం తెలుపుతుంది. ఎందుకంటే కృష్ణమూర్తి, డిటిపి ఆపరేటర్ కుమారి ఉదయం నుంచి పార్టీ ఆఫీసులో ఎవరి పనుల్లో వారున్నారు. ఆ రోజు రాత్రి 7.30 గంటలు అయింది. మరుసటి రోజు ప్రెస్‌మీట్‌కి డిటిపి వర్కు అవుతోంది. టైం ఎక్కువయింది.. నువ్వు ఇంటికి వెళ్లాపోమ్మా.. మిగతా పని కృష్ణ సహాయం చేస్తాడని కుమారిని పంపేశాము. రాత్రి 8 గంటలల సమయంలో కృష్ణమూర్తిగారు 'నేను ఇంటికి వెళ్తున్నాను సార్' అంటే వెళ్లండి కృష్ణమూర్తిగారు అన్నాను. ఆయన ఇంటికి వెళ్లడం, భోజనం చేయడం, మరణించడం కొద్ది గంటల్లోనే జరిగిపోయాయి. ఈ బాధాకరమైన వార్త కామ్రేడ్ ఆర్‌కెఎస్‌వి.కుమార్ చెబితే నేను నమ్మలేకపోయాను. నా మనస్సును కలిచివేసింది.

మనిషి మరణం ఏ రూపంలో, ఏక్షణమైనా పొంచి ఉంటుంది. కానీ బతికినన్నాళ్లు, ఎలా బతికాం.. ఎవరి కోసం బతికామన్నదే ముఖ్యం. ప్రజల కోసం జీవితాలు త్యాగం చేసిన వారు మరణించాక కూడా చిరస్మరణీయులుగా ఉంటారు. కృష్ణమూర్తిగారు కూడా ఈ కోవలోకే చెందినవారు.

సిపిఎం కార్యకర్తలు ఏ స్థాయి కమిటీకి నాయకత్వం వహించినా, ఆ కమిటీ అకౌంట్స్ చూసే బాధ్యునికి అంత విలువ, బాధ్యత ఉంటుంది. పార్టీ విశాఖ జిల్లా కమిటీ బాధ్యతను కృష్ణమూర్తి దశాబ్దాల తరబడి అత్యంత కచ్చితంగా నిర్వహించారు. విశాఖ నుంచి అనకాపల్లి జిల్లా విడివడిన తరువాత కృష్ణమూర్తి పూర్తి కాలం కార్యకర్తగా విశాఖ జిల్లా కమిటీ పరిధిలోకి వచ్చారు. ఆయన పాత బాధ్యత అకౌంట్స్ నిర్వహణ చేయించాలని నేను, కామ్రేడ్ కె.లోకనాథం అనుకున్నాం. ఆయనతో మాట్లాడాం. కానీ ఆయన నివాస ప్రాంతాల పని చేయాలనే మక్కువతో ఉన్నారు. కానివ్వండి మీ ఇష్టం. మీకు నచ్చిన పనిలో చేయండి అన్నాము. ఆరిలోవలో కృష్ణమూర్తి పని ప్రారంభించారు. కొంతకాలం తరువాత కామ్రేడ్ సిహెచ్.నర్సింగరావుగారు కృష్ణమూర్తితో మాట్లాడి ఈ వయస్సులో ఏరియా పని చేయడం సాధ్యమేనా.. నీ విలువైన అకౌంట్స్ పని నిర్వహణ మంచిది. ఆలోచించు అన్నారు. దీనికి వెంటనే అంగీకరించారు. ఆఫీసుకు వచ్చారు. సార్ ఉదయం పూట ఏరియా వర్కు కొంత చేసి 10 గంటల తరువాత ఆఫీసు వర్క్ చేస్తానని చెప్పారు. మీ ఇష్టం. మీ ఆరోగ్యం చూసుకుని చేయండన్నాము.

కృష్ణమూర్తి ఆఫీసుకు వచ్చాక ఒక్క అకౌంట్స్‌కే పరిమితం కాలేదు. పార్టీకి సంబంధించిన పలు రికార్డులు, సమాచారం కంప్యూటరీకరణకు పూనుకున్నారు. అకౌంట్స్ మాత్రమే కాదు.. ఆఫీసును సక్రమంగా తీర్చిదిద్దే బాధ్యత నాదే అన్నట్టు పని ప్రారంభించారు. కానీ అర్ధాంతరంగా అస్తమించారు. కృష్ణమూర్తిగారికి శ్రద్ధాంజలి ఘటించిన సందర్భంలో ఆ కాలనీ వాసి రమణ చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి. 'ఆయన జీవితంలో ఒక్క రూపాయి ఎవరి వద్దా లంచం తీసుకోలేదండి. మా కాలనీ పోరాటంలో పాల్గొన్నాడు. స్కీం ఇల్లు రావడానికి పాటుపడ్డాడు. ఆయనకు లాటరీలో కింది ఇల్లు వచ్చింది. నాయకుడిని నేను కింద తీసుకోను. ఇతరులు అపార్థం చేసుకుంటారని ఆయనకొచ్చిన గ్రౌండ్ ఫ్లోర్ ఇంటిని వేరొకరికి ఇచ్చేసి పై అంతస్తుకు వెళ్లిపోయారు' అని ఆ వ్యక్తి చెప్పాడు. ఎవరి దగ్గరా వేలెత్తి చూపించుకోలేదని, మంచి వ్యక్తిని కోల్పోయామని బాధపడ్డాడు. ఇలా అనేకమంది హృదయాల్లో కృష్ణమూర్తి స్థానం సంపాదించుకున్నారు. అత్యంత విలువైన కామ్రేడ్‌ను కోల్పోయాం. ఆయన పని పద్ధతులు, నిబద్ధత మనందరకూ ఆదర్శం. ఆచరిద్దాం. జోహార్ కామ్రేడ్ కృష్ణమూర్తి

- ఎం.జగ్గునాయుడు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి

కాలనీల ఏర్పాటుకు విశేష కృషి

ఆరిలోవ అభివృద్ధికి తొలి నుంచీ కామ్రేడ్ కృష్ణమూర్తి విశేషమైన కృషి చేశారు. ఆరిలోవలోని ప్రస్తుతం శ్రీలీలాసుందరయ్యనగర్, సుందరయ్యనగర్, బిటిఆర్‌నగర్, రాజీవ్ నగర్, బిఎన్ఆర్ నగర్ లాంటి కాలనీలు ఏర్పాటు చేయడంలో అయన పాత్ర ఎంతో కీలకమైనది. సుందరయ్యనగర్, క్రాంతినగర్ కాలనీలో ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని దుర్గాలమ్మ గుడి వద్ద జరుగుతున్న జన్మభూమి సభలో కలెక్టర్‌ను నిలదీశారు. పోలీసులు ఆయనను అరెస్టు చేస్తే కాలనీ వాసులందరూ కలెక్టర్ కారును, కృష్ణమూర్తిని ఎక్కించిన పోలీసుల జీపును అడ్డుకున్నారు. కలెక్టర్ దిగి వచ్చి అందరికీ పట్టాలు ఇస్తామని చెప్పి వాగ్ధానం చేశారు. కృష్ణమూర్తిని విడుదల చేశారు. కృష్ణమూర్తి సుందరయ్యనగర్, క్రాంతినగర్ కాలనీలకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటాలు చేశారు.

సూర్యమణి,
సిపిఎం ఆరిలోవ జోన్ నాయకులు

ఆదర్శ కమ్యూనిస్టు

నేను విద్యార్థి ఉద్యమం నుంచి రిలీవై యువజన బాధ్యతలు తీసుకుంటున్న సమయంలో 1995లో నాకు ఆరిలోవ బాధ్యతలు అప్పగించారు. నేను ఆరిలోవ వెళ్ళే సరికి డివైఎఫ్ఐకి ఆ ప్రాంతంలో మంచి పేరు ఉంది. అప్పటికే కామ్రేడ్ కృష్ణమూర్తి ఆ ప్రాంతంలో డివైఎఫ్ఐగా ఆరిలోవ ప్రాంతానికి మౌలిక వసతుల కల్పనకు ఆందోళన చేసి ఉన్నారు. విశాఖ జిల్లాలో బివి.రాఘవులతో కలిసి ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. ఆరిలోవలో ఇల్లు లేని పేదవాళ్ళతో బిటిఆర్ నగర్, సుందరయ్యనగర్, లీలాసుందరయ్యనగర్ వంటి కాలనీలు ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ కాలనీలు ఏర్పాటులో ప్రభుత్వంతోనూ, రాజకీయపార్టీలతోనూ, స్థానిక రౌడీ మూకలతోనూ అనునిత్యం ఘర్షణలు జరుగుతుండేవి. ఈ గొడవల్లో అనేక సార్లు జైలుకు కూడా వెళ్ళారు. 2000లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ కాల్పులు జరిగిన సందర్భంలో అక్కడే ఉన్నారు. 2006లో ప్రస్తుత హెల్త్ సిటీ ప్రాంతంలో జరిగిన భూపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14 రోజులు విశాఖ కేంద్ర కారాగారంలో జైల్లో ఉన్నారు. తిరిగి 2008లో బిఎన్ఆర్ నగర్ ఏర్పాటు చేస్తున్న సందర్భంలో అరెస్టు అయ్యి 13 రోజులు జైల్లో గడిపారు. తనకు ఏపని అప్పగించినా ఎంతో క్రమశిక్షణతో దానిని నిర్వహించేవారు. చనిపోయేవరకు నిజమైన కమ్యూనిస్టుగా బతికారు.

- ఆర్‌కెఎస్‌వి.కుమార్,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

క్రమశిక్షణకు మారుపేరు

క్రమశిక్షణగల కమ్యూనిస్టుగా కృష్ణమూర్తికి పేరు. మా అందరికీ అదర్శప్రాయుడు. చనిపోయిన వరకు నిజమైన, ఆదర్శమైన కమ్యూనిస్టుగా బతికారు. చనిపోయిన తరువాత కూడా తన కళ్ళను దానం చేశారు. తన పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం ఆంధ్రమెడికల్ కాలేజీకి డొనేట్ చేశారు. ఎప్పటికీ మావంటి వారికి ఆయన స్ఫూర్తిదాయకం.

వి.నరేంద్ర కుమార్,
సిపిఎం ఆరిలోవ జోన్ నాయకులు

మృధు స్వభావి

కామ్రేడ్ కృష్ణమూర్తి కమ్యూనిస్టు సిద్ధాంతాలను గట్టిగా నమ్మిన వ్యక్తి. ఆరిలోవ శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో ఎవరికైనా ఏదైనా పని అప్పగించే సమయంలో నెమ్మదిగా, సున్నితంగా చెప్పి పని అయ్యే విధంగా చూసేవారు. అర్ధరాత్రి సమయంలో ఎవరికైనా సమస్య ఉందని చెపితే కష్టంగా భావించకుండా వెంటనే స్పందించే వ్యక్తి. ఆయన కష్టపడే మనస్తత్వం, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, ఆయన చూపించే ధైర్యం, మా అందరికి ఆదర్శంగా నిలుస్తాయి.

- పి.శంకరరావు, సిపిఎం ఆరిలోవ జోన్ నాయకులు

అత్యంత నిరాడంబరుడు

సిపిఎంలో అత్యంత సీనియర్ కామ్రేడ్ వి.కృష్ణమూర్తి. ఆరిలోవ కాలనీ ఏర్పాటు దగ్గర నుంచి ఆ కామ్రేడ్ పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణానికి అత్యంత కృషి చేసారు. ఆరిలోవ ప్రాంత ప్రజలకు సుపరిచితుడు. ఏప్రిల్ 18 రాత్రి 8 గంటల వరకు పార్టీ ఆఫీసులో పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, ఆఫీస్ టైపిస్ట్ కుమారి, నేను, ఆయన కలిసే ఉన్నాం. 19న సిపిఎం, సిపిఐ ప్రెస్ మీట్ వుంది 9 గంటలకే వచ్చి ఏర్పాట్లు చూస్తానని మాతో చెప్పి మరీ ఇంటికి వెళ్లారు.ఆ తరువాత కొద్ది గంటలకే చనిపోయినట్టు తెలిసింది. చాలా బాధపడ్డాం. అత్యంత నిరాడంబరుడు, సౌమ్యశీలి, అకౌంట్స్ నిర్వహణలో దిట్ట. 2006 నాటికి ఆయన ఆఫీస్ కార్యదర్శిగా ఉంటూ పార్టీ అకౌంట్స్ నిర్వహించేవారు. 2006లో ఆయన నివాస ప్రాంతంలో పని చేస్తానని చెప్పి రిలీవ్ అయ్యారు. అప్పటికే మల్కాపురం ఆఫీస్ కార్యదర్శిగా ఉన్న నన్ను ఆయన బాధ్యతలలోకి తెచ్చిపెట్టారు. అకౌంట్స్ నిర్వహణ, కంప్యూటర్‌లో అవగాహన లేని నాలాంటి వారికి మెళకువలు నేర్పిన గురువు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు.

-వి.కృష్ణారావు, సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి



వందలాది మందితో సాగుతున్న కృష్ణమూర్తి అంతిమయాత్ర



కృష్ణమూర్తి పార్థివదేహాన్ని ఎంసికి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు, సిపిఎం నేతలు

జోహార్..
కామ్రేడ్ కృష్ణమూర్తి



పౌష్టికాహార సరుకులు అందజేస్తున్న సురేఖ తదితరులు

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి ఏరియా ఆసుపత్రి పరిధిలోని 72 మంది టిబి రోగులకు శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేఖ తెలిపారు. ఈ పౌష్టికాహారాన్ని హెటిరో కంపెనీ సమకూర్చిందని వివరించారు. కార్యక్రమానికి హాజరైన రోగులకు రాగిపిండి కేజీ, కొమ్ముశెనగలు కేజీ, బెల్లం కేజీ, పలుకులు ఒకటిన్నర కేజీ, గోధుమపిండి కేజీ, ఆయిల్ కేజీ, కందిపప్పు కేజీ, పెసరపప్పు కేజీ చొప్పున అందించడం జరిగిందన్నారు. ఆసుపత్రి పరిధిలోని టిబి రోగులందరికీ ప్రతినెలా 6 నెలల పాటు పౌష్టికాహారం అందించడానికి హెటిరో కంపెనీ ఆమోదించిందని డాక్టర్ సురేఖ తెలిపారు. కార్యక్రమంలో ఎంఓడిటిసి కిషోర్‌కుమార్, టిబి సూపర్‌వైజర్స్ సత్యనారాయణ, రాధిక, రోజారమణి పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది కేవీపీ రమణయ్య వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సాయి లక్ష్మణ్, కార్యదర్శిగా సూరా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బంధం వెంకటరమణ, స్పోర్ట్స్ సెక్రటరీగా కే ఈశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీగా జగపతి, కోశాధికారిగా సందీప్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసరావు, మహిళ ప్రతినిధిగా కేత కుసుమ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ప్రసాద్, సాయిరాం, నూకరాజు, రామచంద్రరావు, కిషోర్, లీల, సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించారు.

మంత్రి బూడికి మాజీ ఎమ్మెల్యే సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఇసుకపై సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. దేవరాపల్లి శారదానది పరివాహక ప్రాంతంలో శుక్రవారం రామానాయుడు పర్యటించి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో పేదవాడికి ఫ్రీగా ఇసుక ఇచ్చేవాళ్ళమని, వైసీపీ ప్రభుత్వంలో బడా బాబులకు, డిప్యూటీ సిఎం కాంట్రాక్టు పర్యులకు తప్ప పేదవాడికి ఇసుక అందుతుందా? అని అందులో ప్రశ్నించారు. పేదవాడికి ఇసుక కావాలంటే ఒక ఇసుక ట్రాక్టర్ రూ.10వేలకు కొనుక్కునే పరిస్థితి దాపరించిందని ఎద్దేవా చేశారు. తెనుగుపూడి నుండి బోయిలకింతాడ బూడి ముత్యాలనాయుడు ఇసుక దందా సాగుతుందని ఆరోపించారు. మాడుగుల నుంచి కె.కోటపాడు వరకు ఏటిలో ఇసుకను అధికారులను భయభ్రాంతులకు గురిచేసి దోచుకొని అమ్ముకుంటున్నావ్ అని పేర్కొన్నారు.



శారదా నదిలో ఇసుక తవ్వేసిన ప్రాంతాన్ని చూపుతున్న గవిరెడ్డి

అధికారిక విద్యుత్ కోతలు లేవు

-ఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు
-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ ఏడాది అధికారకంగా విద్యుత్ కోతలు ఏమీ లేవని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు తెలిపారు. 'ఎడాపెడా విద్యుత్ కోతలు' శీర్షికన ఈనెల 17న ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి స్పందించిన ఆయన శుక్రవారం మండల కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే నాణ్యమైన విద్యుత్తును ఎల్లవేళలా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల అప్పుడప్పుడు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. మండలంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ మోటార్లకు లోవోల్టేజ్ సమస్యతో పాటు మోటార్లు రక్షించబడాలంటే రైతులు వారి వ్యవసాయ పంపు చెట్లకు నాణ్యమైన కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్లకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామన్నారు. చౌడువాడలో 5 సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పటికే అమర్చినట్లు తెలిపారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలిగి తమ సిబ్బందితో పరిష్కరించబడకపోతే 1912 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. మండలంలోని ఇప్పటికే 3.8 కిలోమీటర్ల మేర కేబుల్ అమర్చామని, ఐదు కిలోమీటర్ల కండక్టర్లు కూడా వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఇ యుకె.గౌరీ ప్రసాద్, మండల ఎఇ చంద్రశేఖర్, సబ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇపిడిసిఎల్ ఇఇ సురేష్‌బాబు

చోడవరం సుగర్స్‌లో కొనసాగుతున్న అవినీతి

- పంచదార అమ్మకం సొమ్ము జమ చేయని ఉద్యోగులు
- అధికారుల పాత్రపై అనుమానాలు?

ప్రజాశక్తి-చోడవరం

ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న చోడవరం సుగర్ ఫ్యాక్టరీలో సందట్లో సడేమియా అన్నట్లు ఉద్యోగులు తమ అవినీతిని కొనసాగిస్తున్నారు. ఇటీవల పంచదార అమ్మకాల వద్ద ఉన్న గుమస్తా బొబ్బిలి జగదీష్ రూ.26 ఆరు లక్షలు పంచదార అమ్మిన సొమ్ము జమ చేయకుండా కాజేసిన సంగతి తెలిసిందే. అతను వద్ద నుండి కొంత సొమ్మును రికవరీ చేసి సస్పెండ్ చేశారు. తర్వాత ఎ.కృష్ణప్రసాద్ అనే ఉద్యోగిని అక్కడ నియమించారు. ఆయన కూడా రూ.2.50 లక్షలు పంచదార అమ్మిన సొమ్మును జమ చేయడం మానేశాడు. దీంతో ఆయన్ను మామూలుగా సస్పెండ్ చేశారు. ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన రిటైల్ అమ్మకాల్లో నగదు దుర్వినియోగంపై యాజమాన్యం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్థిక కష్టాల్లో ఉన్న సుగర్ ఫ్యాక్టరీ రిటైల్స్ సేల్స్‌లో రోజువారీ సొమ్మును గుమస్తాల వద్ద ఎందుకు అధికారులు ఎప్పటికప్పుడు తీసుకోలేకపోతున్నారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ సొమ్మును ఫ్యాక్టరీలో ఉన్న కొంత మంది అధికారులు తమ సొంత అవసరాలకు వాడుకుని తరువాత జమ చేయడం పరిపాటిగా మారింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు బలైపోతున్నారని కొంతమంది కార్మికులు అంటున్నారు. ఏది ఏమైనా రోజువారీ అమ్మకాలను సొమ్మును అకౌంట్ సెక్షన్ ఎప్పటికప్పుడు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నెలల తరబడి గుమస్తాల వద్ద సొమ్ము ఉండటంతో వాటికి రెక్కలు వస్తున్నాయని విమర్శిస్తున్నారు.

పాడి రైతులకు వడ్డీ లేని రుణాలు

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్



పాడి రైతును సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

పాల ఉత్పత్తిని పెంచడానికి ఆసక్తి, అవసరం ఉన్న రైతులకు పాడిపశువుల కొనుగోలు నిమిత్తం వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నట్లు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. విశాఖ డెయిరీకి ప్రతి రైతూ రోజుకు సరాసరి 10 లీటర్ల పాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలోని దాలివలస, కింతాడ శివారు జోగన్నపాలెం గ్రామాలలో శుక్రవారం ఆయన పాల ఉత్పత్తిదారులతో డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పాడి పశువులకు వైద్యం నిమిత్తం పశు వైద్యులను నియమించనున్నట్లు తెలిపారు. మేలు జాతి పశువులు పెంపకం, వాటి అభివృద్ధిని తెలుసుకోవడానికి దాలివలస, జోగన్నపాలెం పాడి రైతులకు బస్సు యాత్ర ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ డెయిరీ ట్రైనింగ్ సెంటర్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శరగడం శంకర్రావు, విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ కృష్ణ, డిజిఎం పాండ్య రాజన్, ఆయా సొసైటీల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి మెగా ఫోన్ వితరణ

ప్రజాశక్తి- పరవాడ

పరవాడ బిసి కాలనీకి చెందిన పైలా టివి అప్పారావు, లక్ష్మి దంపతులు తమ కుమార్తె పైలా శిరీష 13వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం రూ.6వేలు విలువైన మైక్‌తో కూడిన మెగా ఫోన్‌ను స్థానిక వికలాంగుల భవిత కేంద్రానికి వితరణగా అందించారు. దీనిని వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పైలా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ ఎస్.అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, వైసిపి నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, పైలా జూనియర్ అప్పలనాయుడు, ముత్యాలమ్మ పాలెం ఎంపీటీసీ సభ్యులు అర్జిల్లి దేవి రవి, చీపురుపల్లి అప్పారావు పాల్గొన్నారు.

కెజిబివిలో 60 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని త్యేగాడ కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఇంటర్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డి చంద్రకళ శుక్రవారం తెలిపారు. వీరిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 33 మంది పరీక్షల రాయగా 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జి.అనురాధ 883 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో 24 మంది పరీక్షలు రాయగా 13 మంది ఉత్తీర్ణత సాధించారని, వీరిలో బి తేజశ్రీ 385 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు

ప్రథమ ఇంటర్‌లో జాస్వతకు 465 మార్కులు



ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన కలగ జాస్వత ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 465 మార్కులు సాధించింది. విశాఖపట్నం తిరుమల ఐబిటి మెడికల్ అకాడమీ కాలేజీలో చదువుతున్న ఆమె ఆ అకాడమి టాపర్‌గా నిలిచింది. గ్రామానికి మంచి పేరు తెచ్చిన జాస్వతను, ఆమె తల్లిదండ్రులు కృష్ణవేణి ప్రసాద్‌ను గ్రామస్తులు అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, మినీ అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సబ్బవరం ఐసిడిఎస్ సిడిపిఒ వి.లలిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం మండలంలో అసకపల్లి-1లో అంగన్వాడీ కార్యకర్త (ఎస్‌సి), నాయనమ్మ పాలెంలో ఆయా (ఎస్‌సి), రావలమ్మపాలెం-2లో ఆయా (ఎస్‌సి), బలిజపాలెంలో ఆయా (ఎస్‌సి), సబ్బవరం గణపతిపురంలో మినీ కార్యకర్త (ఎస్‌టి), పరవాడ మండలం వాడ చీపురుపల్లి పోలిరెడ్డిపాలెంలో కార్యకర్త (ఎస్‌సి), గొరుసువానిపాలెంలో ఆయా (ఎస్‌టి), ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెంలో ఆయా (ఎస్‌సి), వాడచీపురుపల్లి నరసాపురంలో మినీ కార్యకర్త (ఎస్‌సి), పెద మామిడివాడ, విజయరామపురంలో మినీ కార్యకర్త (ఎస్‌టి) కలపాక,మరిశివానిపాలెంలో మినీ కార్యకర్త (ఎస్‌టి) తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు 18-35 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. మే 5వ తేదీలోగా దరఖాస్తులు తమ కార్యాలయానికి నేరుగాగాని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని పంపించాలని సూచించారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

ఎస్‌పికి బాధిత మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి-చోడవరం : చీడికాడ మండలం వరహాపురం గ్రామానికి చెందిన ఎలమంచిలి లక్ష్మి అనే మహిళ అనకాపల్లి ఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన ఎలమంచిలి చిన్న అనే వ్యక్తి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ దాడికి సంబంధించి గురువారం చోడవరం పోలీస్ స్టేషన్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో బాధిత మహిళతోపాటు ఆమె భర్త, ప్రజాసంఘాల నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పునరుద్ధరణ

ప్రజాశక్తి- వడ్డాది : గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి బంగారు మెట్ట ఫామ్ ఆయిల్ వద్ద విరిగిన విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరించారు. ఈదురుగాలులకు తాటిచెట్టు ఒరిగి విద్యుత్ స్తంభంపై పడి వైర్లు తెగి, విద్యుత్ స్తంభం విరిగిపోయిన విషయం తెలిసిందే. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది విరిగిన స్తంభాన్ని తొలగించిన కొత్త స్తంభాన్ని వేశారు. రోడ్డుకు అడ్డంగా పడిన తాటి చెట్టుని లైన్ మెన్ రాజు తన సొంత ఖర్చులతో జెసిబి సహాయంతో తొలగించారు. లైన్ మెన్ రాజును పలువురు అభినందించారు.



కొత్త స్తంభాన్ని వేస్తున్న సిబ్బంది

తాడి గ్రామాన్ని తరలించాలని నిరసన

ప్రజాశక్తి -పరవాడ

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని, తాడి గ్రామాన్ని తరలించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న తాడి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ 2022 ఏప్రిల్ 28 పైడివాడ అగ్రహారంలో పట్టాల పంపిణీ సందర్భంగా తాడి గ్రామాన్ని 15 రోజుల్లో తరలిస్తామని హామీ ఇచ్చారని, నేటికి సంవత్సరం పూర్తయినా ఇప్పటికీ తరలించలేదని పేర్కొన్నారు. తరలించే చర్యలు చేపట్టకుండా ఇప్పుడు మరో కాలుష్య కుంపటిని గ్రామంపై పెట్టడానికి ఫిల్లింగ్ కోసం 50 ఎకరాలకు స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం దారుణమన్నారు. వెంటనే ఫిల్లింగ్ నిమిత్తం కేటాయించిన 50 ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని, గ్రామాన్ని వెంటనే తరలించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఇంటికి ధర కట్టాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. రాంకీ యాజమాన్యం చర్యల వల్లనే గ్రామం కాలుష్యం ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్ నిబంధనలు ఉల్లంఘించి పరిశ్రమలకు భూములను అమ్మకాలు చేసిన రాంకీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా యాజమాన్యానికి మద్దతుగా నిలవడం దారుణమన్నారు. గ్రామాన్ని తరలించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుర్రం నూకరాజు, కే రాము, పి సత్యవతి, జి నరసింహ, జి లక్ష్మి, సింధు, సత్తిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న చిన్న తాడి గ్రామస్తులు



చంద్రబాబుకు ఆహ్వానం అందజేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

చంద్రబాబుకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మే 11న జరగనున్న తన కుమారుని వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నాగేశ్వరరావుతో పాటు మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు చంద్రబాబును కలిశారు. వివాహ ఆహ్వాన పత్రికతో పాటు మెమెంటోను అందజేసి మే నెల 11వ తేదీన జరిగే వివాహానికి రావలసిందిగా కోరారు.

అనారోగ్యంతో ఇన్‌ఛార్జి ఎంఇఒ మృతి



శ్రీనివాసరావు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ఇన్‌ఛార్జి మండల విద్యా శాఖ అధికారి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గురువారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూనే ఆయన విధులు నిర్వహించేవారు. అందరితో సమన్వయంతో ఉంటూ విద్యాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తెలిపారు. ఆయన సొంత ఊరు తగరపువలస దగ్గర రాయిపాలెంలో అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు చోడవరం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు వెళ్లారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డైట్ విద్యార్థికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి -అనకాపల్లి : పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎంబిఏ విద్యార్థి ఎంకే లలితేశ్వరరావు ద్వితీయ స్థానం సాధించారు. పదవ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ చాంపియన్ షిప్-2023 పోటీలు ఆంధ్ర విశ్వవిద్యాలయం జిమ్నాజియంలో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో 93 కిలోల పురుషుల విభాగంలో లలితేశ్వరరావు ద్వితీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చల్ల నరసింహం, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ రామ్ కుమార్, అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు అభినందించారు.

మార్కెట్ ధరకు ఐదు రెట్లు పెంచి నష్టపరిహారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువకు ఐదు రెట్లు పెంచి నష్ట పరిహారం ఇవ్వాలని ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణికి రైతులు విన్నవించారు. మండలంలోని పిసినికాడ గ్రామంలో శుక్రవారం సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. నిర్వాసిత రైతులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ భూసేకరణ, జాతీయ రహదారి భూసేకరణ ఏ విధంగా ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చారో అదేవిధంగా నష్టపరిహారంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. భూసేకరణ నోటిఫికేషన్‌లో తప్పొప్పులను సరిచేసి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ జెడి లివింగ్స్టన్, పిఐపిఎల్ఎంసి, గ్రామ సర్పంచ్ ఎల్లపు వెంకట రమేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే జీవితంలో ఎదుగుదల

ప్రజాశక్తి- అనకాపల్లి : క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారానే ఏ వ్యక్తి అయినా జీవితంలో ఎదుగుదల సాధిస్తారని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. గురుకుల పాఠశాలలో శుక్రవారం పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులు తల్లిదండ్రులతో బడి వేపు ఒక అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి పౌరులుగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కర్రి గంగాధర్ రావు, ఉపాధ్యాయులు మహేంద్ర నాథ్ పట్నాయక్, కమల, మదన్మోహన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలలు, స్వయం సహాయక బృందాలకు, పారిశ్రామికవాడల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ప్రధానంగా రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ లైట్లు, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ అండ్ బి, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, నేషనల్ హైవే శాఖలు సంయుక్తంగా ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో 24 గంటలు ఎముకల వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డిఆర్‌ఓ వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ అధికారి ఎం వీర్రాజు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, ఎన్టీఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డిఆర్‌డిఏ పిడి లక్ష్మీపతి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీధర్, రవాణా పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని తానాం పంచాయతీ పరిధిలో మైలాన్ కంపెనీ నిధులు కోటి 15 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.90 లక్షలతో చేపడుతున్న ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనం కోసం మైలన్ కంపెనీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జెడ్పీటీసీ సభ్యులు పైల సన్యాసిరాజు, వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ, ఎంపీటీసీ రొంగలి సునీత, ఎంపీడీఓ హేమసుందరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విజయలక్ష్మి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్ తదితరులు

మహిళ మృతికి కారణమైన వారికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి-చోడవరం : మహిళను అసభ్య పదజాలంతో తిట్టడమే కాకుండా, అసంబద్ధ నిందలు మోపి, ఆమె మనస్తాపంతో మృతి చెందడానికి కారణమైన ముగ్గురు వ్యక్తులకు చోడవరం కోర్టు శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. అల్లూరు జిల్లా పాడేరు మండలం వర్తనపల్లి గ్రామానికి చెందిన మోస చంద్రకళ, మోస నాగమణి, కంబడి శివశంకర్ అనే వ్యక్తులు సోనా శివరామకృష్ణ అనే వ్యక్తితో వాడుక నీరు కాలువ విషయమై ఇంటి వద్ద 2021 నవంబర్ 28న గొడవపడ్డారు. గొడవలో శివరామకృష్ణ తల్లి తోపాటు చెల్లెలు గాయత్రిని నిందితులు ముగ్గురు కలిసి లేనిపోని నిందలతో అసభ్య పదజాలంతో తిట్టారు. దీంతో మనస్తాపానికి గురైన గాయత్రి అదే రోజు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పట్లో పాడేరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వాదనలు విన్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణ శ్రీ నేరం రుజువు కావడంతో ముగ్గురు వ్యక్తులు మోస చంద్రకళ, మోస నాగమణి, కంబడి శివశంకర్‌కు శిక్షణ ఖరారు చేశారు.

రైళ్లలో అన్ని రాయితీలూ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సీనియర్ సిటిజనులకు రైల్వే ప్రయాణంలో గతంలో ఇచ్చిన అన్ని రాయితీలు పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు రామాలయం వద్ద సీనియర్ సిటిజన్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అన్ని రైళ్ల నిలుపుదల చేయడంతో సీనియర్ సిటిజనులకు ఇచ్చే రాయితీలు రద్దు చేశారని తెలిపారు. కరోనా తగ్గుముఖం పట్టిన సీనియర్ సిటిజనులకు గతంలో ఇచ్చిన రాయితీలు మాత్రం పునరుద్ధరించలేదన్నారు. అనంతరం ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల ఆర్ మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణమోహన్, పీఎంఎల్ నరసింహం, కే వెంకట అప్పారావు, కే చిన్ను పాల్గొన్నారు.

30న ఎర్నితల్లి తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వడ్రపాలెం గ్రామంలో ఈ నెల 30న జరగనున్న ఎర్నితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం తారువలోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని కమిటీ వారికి సూచించారు. తీర్థం సందర్భంగా ఎడ్ల పరుగు పందేల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ కె.సత్యారావు, మాజీ సర్పంచ్ కె.నాయుడు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఈ ఏడాది ఫిబ్రవరి 23న 18 కేజీల గంజాయి పట్టుకున్న కేసులో పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నాడు యూపీకి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారికి గంజాయి విక్రయించిన చింతపల్లి మండలం ఏ.అన్నవరం గ్రామానికి చెందిన కిల్లో కొటేష్ నాటి నుంచి పరారీలో ఉండగా, గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. ఈ వ్యక్తిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

1 నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ క్రీడా పాధికార సంస్థ, అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ ఆదేశాల మేరకు మే 1 నుండి 31వ తేదీ వరకు చోడవరంలోని గణేష్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ పుల్లేటిటి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్లలోపు బాల బాలికలకు నిర్వహించే ఉచిత శిక్షణ ప్రతిరోజు ఉదయం 6 నుండి 8 గంటలకు వరకు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అనకాపల్లి జిల్లా క్రీడాపాధికార సంస్థ ద్వారా ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతుందని జిల్లా క్రీడా అధికారి సూర్యారావు తెలిపారు. ఆసక్తి కలిగిన బాల బాలికలు ఆధార్ కార్డు జెరాక్స్, రెండు ఫొటోలతో గణేష్ డిఫెన్స్ అకాడమీలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9642081090 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తూతూ మంత్రంగా సరిహద్దు రాళ్లు

ప్రజాశక్తి-అచ్యుతాపురం: జగనన్న శాశ్వత భూ హక్కు కార్యక్రమంలో భాగంగా వేస్తున్న సరిహద్దు రాళ్లు తూతూ మంత్రంగా వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూమిలో ఎక్కువగా లోతు తవ్వి వేయాల్సి ఉండగా, పైపైనే వేస్తున్నారు. ఒక రాయిని భూమిలో పాతడానికి ప్రభుత్వం రూ.100 చొప్పున కూలి ఇస్తుంది.



కాని సిబ్బంది పర్యవేక్షణ సరిగా లేకపోవడమో ఏమోగాని భూమి లోపలకు గుయ్యి తీసి రాళ్లు పాతడం లేదు. పైపైనే వేస్తున్న రాళ్లు చెయ్యి వేస్తే పడిపోతున్నాయి అన్నట్లుగా ఉన్నాయి. రాళ్లు వేసే పునులపై పర్యవేక్షణ కరువైంది. జగనన్న భూ శాశ్వత పథకంలో రికార్డుల్లో శాశ్వతంగా ఉంటాయేమోగాని నేలపై వేస్తున్న రాళ్లు తాత్కాలికంగానే కనిపిస్తాయి. దీనిపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాళ్లు భూమి లోపలకు వేయని పక్షంలో వెంటనే ఊడిపోతాయని రైతులు చెబుతున్నారు. అధికారులు చెత్తశుద్ధితో పర్యవేక్షణ చేసి సరిహద్దు రాళ్లు శాశ్వతంగా ఉండే విధంగా పాతాలని రైతులు కోరుతున్నారు.



నూతనంగా తీర్చిదిద్దిన గ్రంథాలయం

సుందరంగా గ్రంథాలయం

- దాతల సహకారంతో రంగులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్‌లో శాఖ గ్రంథాలయం సర్వాంగ సుందరంగా తయారైంది. ఇటీవల బదిలీపై వచ్చిన లైబ్రేరియన్ పి.దమయంతి కొందరి దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా మారుస్తున్నారు. పాఠకులు చదివే గదులకు రంగులు వేయించి గాలి వెలుతురు వచ్చే విధంగా కిటికీలకు కర్టెన్లు ఏర్పాటు చేశారు. గ్రంథాలయ భవనం చూపరులకు ఆకట్టుకునే విధంగా నూతనంగా తయారు చేయించారు. ఈ సందర్భంగా దమయంతి విలేకరులతో మాట్లాడుతూ, తాను విధుల్లోకి వచ్చిన తర్వాత నూతనంగా 1262 పుస్తకాలు ఏర్పాటు చేసానని, గోడలు, గదులకు రంగులు వేయించానని, సహకరించిన దాతలు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



దమయంతి, గ్రంథాలయాధికారి

వేసవి సెలవులలో విద్యార్థులకు సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్నామని, గ్రంథాలయానికి ప్రతీ రోజు ఉదయం ఎనిమిది గంటలకు పంపించాలని కోరారు. సమ్మర్ క్లాసులలో ఆటలతో పాటు యోగ, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి -రావికమతం: వేసవి సెలవుల్లో విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలో కవగుంట ఎంపీ యూపీ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ వేసవి సెలవుల కారణంగా విద్యార్థులను విచ్చలవిడిగా వదలరాదన్నారు. ఈ ఏడాదిలో నేర్చుకున్న పాఠాలను ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చదువుకునేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ఎండల్లో ఎక్కువగా తిరగకుండా చూడాలని, చెరువులు, వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాదు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో వాహనాల రాకపోకలు

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-మునగపాక రూరల్: ప్రమాదాలు ఏదో ఒక రూపంలో సంభవించి ప్రాణాలు హరిస్తున్నా, కాళ్లు చేతులు విరుగుతున్నా, తమకేమీ సంబంధం లేదన్నట్లు కొంత మంది వాహనదారులు యథేచ్ఛగా రోడ్లపై అధిక లోడ్‌తో, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. ప్రధానంగా అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు మార్గంలో రోజుకొక ప్రమాదం జరుగుతున్నాయి. సమీప క్వారీల నుండి బండరాలను నిబంధనలకు విరుద్ధంగా టన్నుల కొలది అచ్యుతాపురం కంపెనీలకు కనీస సేఫ్టీ లేకుండా లారీల్లో తరలిస్తున్నారు. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇదే తరహాలో సరుగుడు దుంగలు తీసుకెళ్తున్న లారీలు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. పరిమితికి మించిన భారీ లోడుతో, అధిక స్పీడ్‌తో వెళ్తుండడంతో దాని పక్కగా, వెనుకగా ప్రయాణిస్తున్న చిన్న వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. అసలే రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. మరో వైపు ఈ మార్గంలో భారీ వాహనాలు తిరగడంతో, మలుపుల వద్ద లారీలో ఉన్న సరుగుడు కర్రలు ఎక్కడ ఒరిగి ఎవరిపై పడతాయో తెలియని పరిస్థితుల్లో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ మార్గంలో తిరుగుతున్న లారీలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మృత్యు కుహరంగా మారిన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో ట్రాఫిక్ నిబంధనలు తుంగలో తొక్కుతున్న ఇటువంటి వాహనాలను అదుపులోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



భారీ లోడ్‌తో వెళుతున్న వాహనం

సమస్యల నడుమ జగనన్న కాలనీ

-నీరు లేక నిర్మాణ పనులకు లబ్ధిదారుల అవస్థలు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని రత్నంపేట గ్రామంలో జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన స్థలంలో పక్కన స్కూల్ కాంపౌండ్ వాలుకు కరెంట్ మీటర్‌ను అమర్చి బోర్‌వెల్‌కు మోటారు మరిచారు. మండుటెండలో నీరు లేక జగనన్న ఇళ్ల లబ్ధిదారులు పెరమండ రమణమ్మ, దాసరి మంజుల, కన్నపల్లి జ్యోతి, కోసూరి శ్రీను తదితరులు 12 మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రత్నంపేట గ్రామంలో జగనన్న కాలనీకి 12 మంది లబ్ధిదారులకు మండల పరిషత్ పాఠశాల వెనుక భాగాన స్థలం కేటాయించారు. స్థలం కేటాయించారు కానీ వారికి ఆది నుండి ఇప్పటి వరకూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రారంభంలో 12 మందికి రెవెన్యూ అధికారులు పట్టాలు పంపిణీలో గజిబిజి చేసి ఇబ్బంది పడ్డారు. పట్టా నెంబరు ఒకరికొకరికి తేడాగా ఇవ్వడం జరిగింది. బోరు ఏర్పాటు చేశారు.. కానీ మోటారు వేయలేదని స్పందనలో ఫిర్యాదు చేయగా నెల రోజుల క్రితం కరెంట్ మీటరు స్కూల్ కాంపౌండ్‌కు ఏర్పాటు చేశారు.

ఇప్పటికి మోటారు వేయలేదు. రహదారి ఏర్పాటు చేయలేదు. మెటీరియల్ వేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మోటారు వేయక పోవడంతో పునాది, గోడలు వాటరింగ్ చేయటకు అవకాశం లేకుండా పోయింది.



నీటిని తెచ్చుకుంటున్న ట్యాంకు ఇదే...



జగనన్న కాలనీలో నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్

అన్ని రంగాల్లో వైసిపి ప్రభుత్వం విఫలం



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి చోడవరం ఇన్‌ఛార్జి తాతయ్యబాబు తదితరులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. మండలంలోని చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. నిత్యవసరాలు, విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ ప్రజల నెత్తిన జగన్ భారాలు మోపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోకివాడి కోటేశ్వరరావు, సాయం శేషు, మాజీ సర్పంచులు దొంకిన అప్పలనాయుడు, దొండ ఏడుకొండలు, మాజీ ఎంపిటిసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు దొండ నారాయణమూర్తి, లక్ష్మణామూర్తి, సేనాపతి మణికంఠ, పెదరెడ్ల రాజు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి పెచ్చుమీరిందని, ఎక్కడ చూసినా భూకబ్జాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి రవి కుమార్, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాలునాయుడు, కోటాన అప్పారావు, పిబివిఎస్ఎన్ రాజు, గండి దేముడు, రొంగలి దేముడు, బోకం అర్జునుడు, బోకం నారాయణరావు, బాలకృష్ణ, ఎంపిటీసీలు ఎస్.అప్పలరాజు, గొర్లి చైతన్య, పల్లా తాతారావు పాల్గొన్నారు.



మాజీ మంత్రి బండారుకు హారతి పడుతున్న మహిళలు

కె.కోటపాడు : మండలం మేడిచర్ల గ్రామంలో శుక్రవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న టిడిపి నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, పివిజి.కుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగ యువత, రైతులు, దళిత, గిరిజన వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రొంగలి మహేష్, పూడి నారాయణమూర్తి, పూడి శ్రీను, లెక్కల మల్లేశ్వరరావు, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, లెక్కల అవతారమూర్తి, లెక్కల అప్పలనాయుడు, బండారు నరసింహానాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో వెంకన్న ఆలయ అభివృద్ధి

-రూ.2 కోట్లతో కల్యాణ మండపం
- టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి భక్తుల సౌకర్యార్థం అన్ని విధాల అభివృద్ధి చేస్తామని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఆయన ఉపమాక వెంకన్న ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో పల్లకి సేవ, పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద స్వామివారి శేష వస్త్రము ,చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జిల్లా విద్యార్థి యువజన విభాగం అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా పుష్కరిణి అధ్వానంగా ఉందని, భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరుగుదొడ్లు లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. పాయకరావుపేట నియోజక వర్గంలో ఎంతోమంది భక్తులు ఈ దేవాలయంలో వివాహాలు చేసుకోవడం జరుగుతుందని, సరైన కళ్యాణమండపం లేనందున భక్తులు తీవ్ర అవస్థలు గురవుతున్నారని తెలిపారు. గరుడాద్రి పర్వతంపై స్వామి ఆలయం చిన్నదిగా ఉన్నందున, శిథిలావస్థకు చేరినందున నూతనంగా ఆలయం పునర్నిర్మాణం చేపట్ట వలసిందన్నారు. భక్తుల కోసం విశ్రాంతి భవనాలు నిర్మించాలని కోరారు. వాహన మండపము,



వెంకన్న జ్ఞాపికను అందజేస్తున్న ఎంపి, అర్చకులు

కేశఖండనశాల నిర్మించాలన్నారు.

ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ, టిటిడి అధికారులు ఆలయ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు .ఈ సందర్భంగా చైర్మన్ వై వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఆలయాన్ని అన్ని విధాల అభివద్ధి చేసి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. టిటిడి అధికారులను పంపించి త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 2 కోట్లతో కళ్యాణ మండపం నిర్మిస్తామని హామీ ఇచ్చారు.కళ్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి టీటీడీ కేటాయించిన నిధులకు, మ్యాచింగ్ ఫండ్‌ను విశాఖ డెయిరీ నిధుల నుండి మంజూరు చేస్తామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు, ఎంపీ బివి సత్యవతి, వైసిపి జిల్లా అధ్యక్షులు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి కన్వీనర్ వెంకట రామయ్య, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకష్ణ, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, పాల సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, నాయకులు కొల్లాటి బుజ్జి, నరసింహమూర్తి, శేషారత్నం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకూ లబ్ధి

నక్కపల్లి:ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతీ గడపకు లబ్ధి చేకూరిందని ఉత్తరాంధ్ర వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై వి సుబ్బారెడ్డి అన్నారు. నక్కపల్లి లో శుక్రవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు - నువ్వే మా నమ్మకం కార్యక్రమం లో పాల్గొన్నారు.రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకష్ణ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటు చేస్తున్న సభలో ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గొల్ల బాబురావును ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. ఇంతలోనే మాట మార్చి ముఖ్యమంత్రి సీఎం జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని సూచించినా అందరూ ఐక్యంగా కలిసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు, చోడవరం ఎమ్మెల్యే ధర్మ శ్రీ, నియోజకవర్గ పరిశీలకులు వెంకటరామయ్య పాల్గొన్నారు .



సత్కరిస్తున్న సొసైటీ అధ్యక్షులు కొండబాబు, తదితరులు

కల్యాణ మండపానికి నిధులు

- విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపమాకలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో చేపట్టనున్న కళ్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి విశాఖ డెయిరీ తరుపున మ్యాచింగ్ ఫండ్‌ను మంజూరు చేయనున్నట్లు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ వెల్లడించారు.ఈ మేరకు ఉపమాక పాల సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి ,గ్రామ ఉపసర్పంచ్ ప్రగడ వీరబాబు తదితరులు ఆనంద్ కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, డెయిరీ తుని యూనిట్ మేనేజర్ శ్రీను, సూపర్వైజర్ కిరణ్, పలువురు వేతన కార్యదర్శులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో ఈనెల 29న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

రేషన్ డీలర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో ప్రజా పంపిణీ రేషన్ డీలర్ల అసోసియేషన్ కొత్త కార్యవర్గం కొలువు తీరింది. డీలర్ అసోసియేషన్ అధ్యక్షునిగా గొట్టువాడ గ్రామానికి చెందిన డీలర్ సుంకర రాజేష్ ఎన్నిక కాగా, కైలాసపట్నం గ్రామానికి చెందిన వంజరపు కృష్ణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చిన్న, బొడ్డేపల్లి గ్రామానికి చెందిన రాజాన వరహాల దొరను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గానికి మండల వ్యాప్తంగా పలువురు డీలర్లు అభినందనలు తెలియజేశారు.



రాజేష్, అధ్యక్షులు

భానుడు భగ భగ

ప్రజాశక్తి-గొలుగొండ:భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. ఇంట్లో ఉన్నా ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం వడగాల్పులు ఆరంభం కావడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఆ సమయంలో రోడ్డు చాలా వరకు నిర్మానుషంగా దర్శనమిస్తున్నాయి. గొలుగొండ మండలంలోని గొలుగొండ, ఏఎల్‌పురం, పాతకేడిపేట, చోద్యం, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో నిర్మానుషంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కృష్ణదేవిపేటలో రోడ్లు సైతం ఖాళీగానే కనిపిస్తున్నాయి.



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -రావికమతం:రావికమతం స్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడి సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్వాడి సహాయకుల పోస్టులు మంజూరైనట్లు తెలిపారు. రోలుగుంట మండలం అంట్లపాలెం, రావికమతం మండలం తట్టబంద,బుచ్చయ్యపేట మండలం నేతవాణిపాలెం, పిపి అగ్రహారంలో పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 28 నుండి మే5 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.అప్లికేషన్లు పోస్ట్ ద్వారా స్వయంగా కార్యాలయానికి వచ్చి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.



మంటలు ఆర్పుతున్న స్థానికులు

బైక్ నుంచి మంటలు

ప్రజాశక్తి-గొలుగొండ: ఏఎల్ పురం గ్రామంలో ఎండవేడిమికి బైక్ నుంచి మంటలు చెల రేగాయి. కొయ్యూరు మండలం నడింపాలెంకు చెందిన ప్రసాద్ పల్సర్ బైక్‌పై కృష్ణదేవిపేటకు వచ్చాడు. పార్కింగ్ చేయగా పెట్రోల్ ట్యాంక్ నుంచి ఉన్న ఫలంగా మంటలు చెల రేగాయి. దీంతో స్థానికులందరూ మంటలును ఆర్పివేశారు.

20 రోజుల్లో రోడ్డు వెడల్పు పనులు

-ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ తమరాన నాయుడు - సభ్యులు వాకౌట్, కొనసాగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : పురపాలక సంఘం బడ్జెట్ సమావేశంకు ఇన్చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ, నర్సీపట్నంలో 20 రోజుల్లో అందరి సహకారంతో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.మున్సిపల్ సిబ్బంది బడ్జెట్ ప్రతులను చదివి వినిపిస్తుండగా మార్చికి ముందు నెలలో ప్రవేశ పెట్టాల్సిన బడ్జెట్ సమావేశం ఇప్పటివరకు ప్రవేశపెట్టక పోవడంతో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు బడ్జెట్ కాపీలను పట్టుకుని వాకౌట్ చేసారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు చింతకాయల రాజేష్ మీడియా తో మాట్లాడుతూ, బడ్జెట్ కాపీలను వారం పది రోజులు ముందు ఇవ్వవలసి ఉండగా కేవలం రెండు రోజుల క్రితం ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.బడ్జెట్ కాపీ తప్పుల తడకగా ఉందన్నారు. బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసి గడువిచ్చిన తర్వాత పెట్టాలని కౌన్సిలర్ దనిమిరెడ్డి



మాట్లాడుతున్న ఇంచార్జ్ చైర్మన్ అప్పలనాయుడు

మధు డిమాండ్ చేశారు. జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, పురపాలక సంఘంలో కుక్కలు పందులు బెడద చాలా ఎక్కువగా ఉన్నా మున్సిపాలిటీ సిబ్బంది చర్యలు తీసుకోలేదని అన్నారు. పారిశుధ్యం పై కనీసం దృష్టి పెట్టలేదని పట్టణమంతా దుర్గంధం. వెదజల్లుతుందన్నారు. ప్రజలు రోగాల పాలవుతుంటే పురపాలక సంఘం అధికారులు పట్టించుకోలేదన్నారు.

టిడిపి సభ్యులు వాకౌట్

తాత్కాలికంగా నియమింప బడ్డ మున్సిపల్ చైర్మన్ తమరాన నాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశం తెలుగుదేశం కౌన్సిలర్ సభ్యులు లేకుండానే సాగింది. మున్సిపల్ చైర్పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేయడంతో రెండవ వైస్ చైర్మన్ కౌన్సిలర్ తమరాన నాయుడు ను మున్సిపాలిటీ చట్టం ప్రకారం తాత్కాలిక చైర్మన్గా నియమించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నర్సీపట్నం పట్టణ రోడ్డు విస్తరణ మరియు బడ్జెట్ ను ప్రవేశపెట్టే ఎజెండాతో ప్రారంభించిన ఈ సమావేశానికి ఇప్పటివరకు బడ్జెట్ ను ఎందుకు ప్రవేశపెట్టలేదని, మార్చి నెలలో బడ్జెట్ సమావేశాలు పెట్టాల్సింది పోయి మే నెల వరకు ఎందుకు పెట్టలేదని తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఏడు కోట్ల రూపాయల అంచనా బడ్జెట్ ఏర్పాటు చేయడం, ఆలస్యంగా ప్రవేశపెట్టడం విరుద్ధంగా ఉన్నదంటూ సభ నుండి వాకౌట్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రామాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పందనలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. సచివాలయ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని సూచించారు. ఎస్‌టిజి సర్వే, సిటిజెన్ ఔట్ రీచ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్స్‌పై ఆరా తీశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు .



సిబ్బంది తో మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి

ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హేమంత్

ప్రజాశక్తి-మాడుగుల: ఐరన్ మాత్రల పంపిణీ పక్కాగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హేమంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని కెజె పురం, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ, సెలవుల దృష్ట్యా పాఠశాలల విద్యార్థులకు ఐరన్ మాత్రలను వారి ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఎవరికి ఐరన్ లోపం లేకుండా మాత్రల పంపిణీ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఎంకే వల్లాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ పరిశీలించారు.పథకాలు అమలు తీరు, ఇబ్బందులు తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలా ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, కింతలి వైద్యాధికారి కేఎం నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రచార భేరి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంతో పాటు, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, వివి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ములబంద గోడి ప్రాంతంలో శుక్రవారం ఉపాధి హామీ కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి 30 శాతం నిధులు కోత పెట్టిందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆళ్ల సూరిబాబు, అప్పల నరసమ్మ, లక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దేశ రక్షణకు బిజెపిని సాగనంపాలి

- బహిరంగ సభల్లో సిపిఎం, సిపిఐ నేతలు



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న ప్రభావతి



నర్సీపట్నంలో మాట్లాడుతున్న జెవి సత్యనారాయణ మూర్తి

ప్రజాశక్తి-అచ్యుతాపురం: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తేనే ప్రజలకు, దేశానికి రక్షణ అని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. మోడీ ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిసిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు నిర్వహించిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అచ్యుతాపురం తహశీల్దారు కార్యాలయం మీదుగా సంతబయలు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.రాము అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ దేశంలో బిజెపి మోడీ విధానాలతో పేద అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలు నాశనమయ్యాయన్నారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సహజ వనరులను ధారాదత్తం చేసి భవిష్యత్ తరాలకు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, ఈ తొమ్మిదేళ్లలో ఉన్న ఉపాధికే ఎసరు పెట్టారన్నారు. కుల మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చిన రేపుతూ, బిజెపి విధానాలు వ్యతిరేకించే వారిపై భౌతిక దాడులు, హత్యలు, హత్యాచారాలు, నిర్బంధ చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ దేశంలో మోడీని తరిమికొట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని వైసిపి మోడీ విధానాలకు పార్లమెంటులో చేతులెత్తి సమర్ధిస్తుందని, ఇందులో భాగంగానే గంగవరం పోర్టు అమ్మకం, రైల్వే స్టేషన్ నమ్మకం, రైతులకు స్మార్ట్ మీటర్ల బిగింపు వంటి చర్లన్నీ అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రుత్తల శంకర్రావు, వివి.శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, జి.దేముడునాయుడు, కె.సోమునాయుడు, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, మాధవరావు, సన్యాసిరావు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రంలో బిజెపి నిరంకుశ పాలన

నర్సీపట్నంటౌన్: ప్రచార భేరి ముగింపు సభ సందర్భంగా సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హెూంలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సిపిఎం జిల్లా సభ్యులు డి.సత్తిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం పేదలపై పన్నుల భారం వేసి కార్పొరేట్ సంస్థలను పోషిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయమిదేనని పిలుపునిచ్చారు. ప్రశ్నించే ప్రతీ ఒక్కరినీ నిరంకుశంగా అణచి వేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ సంస్థల బ్యాంకు రుణాలను మాఫీ చేసిన బిజెపి రైతులకు వ్యవసాయ రుణాలను మాత్రం మాఫీ చేయలేదన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గ నాయుడు మాట్లాడుతూ, గంగవరం, కృష్ణపట్నం వంటి కీలకమైన ఓడరేవులను, హైడ్రో విద్యుత్తు ప్రాజెక్టుల కోసం విలువైన భూములను సైతం అదానికి మోడీ సమర్పిస్తున్నారన్నారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, అణగారిన వర్గాల రక్షణ కోసం ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం. అప్పలరాజు, నాయుకులు సాపిరెడ్డి నారాయణముర్తి, కెవి సూర్యప్రభ, అడిగర్ల రాజు, ఎల్.గౌరీ, ఎవైఎఫ్ నాయుకులు రాధాకష్ణ, సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి రాజాన దొరబాబు, నాయుకులు శివలంక కొండలరావు, తదిరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో మాట్లాడుతున్న లోకనాథం

బిజెపిని ఓడించాలి: లోకనాథం

పాయకరావు పేట: పట్టణంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార బేరి సభను గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.లోకనాథ్ మాట్లాడుతూ, 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తేనే దేశానికి పట్టిన మోడీ, అదానీ పీడ వదులుతుందన్నారు.రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీని భుజాలపై మోస్తున్నాయని, ఆ పల్లకీని దించి రాష్ట్ర భవిష్యత్ కోసం రాజకీయ పోరాటంలో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, మత సామరస్యం, సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల హక్కులకు బిజెపి తూట్లు పొడుస్తుందని దుయ్యబట్టారు.

సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి రావు జగ్గారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బిజెపి, వైసిపి కలిసి ముందుకు సాగుతున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కుకు ప్రజలు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. దేశంలో మోడీకి 30 మంది దత్తపుత్రులుండగా, వారిలో 29 మంది దేశం వదిలి విదేశాలకెళ్లి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, కోటేశ్వరరావు, సిపిఐ నేతలు జగ్గారావు, అర్జున్ రావు, సుబ్బలక్ష్మి, శివ ప్రకాష్ పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని స్థానిక డిఎఫ్ఒ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి.సత్తిబాబు మాట్లాడుతూ, గొలుగొండ మండలం కె.యల్లవరం శివారు డొంకాడ గిరిజన రైతులు ఆరిల్లోవ పారెస్ట్ పరిదిలో సుమారు 22ఏళ్లుగా సాగు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. వీరికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అదికారులకు ధఖాస్తులు చేశారన్నారు. 2022లో సర్వే జరిగి నప్పటికీ డొంకాడ గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వకుండా పారెస్ట్ ఆదికారులు అడ్డుకుంటునారని విమర్శించారు. ఈ విషయంపై డిఎఫ్ఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, గొలుగుండ సిపిఎం సీనియర్ నాయుకులు సాపిరెడ్డి నారాయణముర్తి, డొంకాడ రిగిజన రైతులు టి.అప్పారావు, సత్తిబాబు, చంటి, ఈశ్వరావు, పాండురాజు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి -కొత్తకోట: భార్య పుట్టింటి నుంచి కాపురానికి రాలేదనే మనస్థాపంతో కలత చెందిన భర్త పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రావికమతం మండలం కొత్తకోటలో శుక్రవారం చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్సై విభూషణరావు అందించిన వివరాల మేరకు.. కొత్తకోట గ్రామానికి చెందిన కోట మణింద్ర (33) మద్యానికి బానిసై తన భార్య నూకరత్నంతో తరచూ గొడవలు పడడంతో ఆమె పుట్టింటికి వెళ్ళి పోయింది. కాపురానికి రమ్మన్నా రాకపోవడంతో మనస్థాపం చెంది శుక్రవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన చుట్టుపక్కల బంధువులు మంటలను నివారించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ మణింద్ర మృతి చెందాడని ఎస్సై వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.